బుధవారం
08-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 17
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

చంద్రబాబుతో టీటీడీపీ నేతల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం ఉండవల్లి నివాసంలో తెలంగాణ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో అనుసరించాల్సిన విధానంపై చర్చించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు విడుదలైంది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వైఖరిపైనా చర్చించినట్లు సమాచారం. చంద్రబాబు వద్దకు తెలంగాణ రాష్ట్ర టీడీపీ నాయకులు

- మిగతా 2 లో

3.66 లక్షల ఓట్ల సంగతేంటి?

రేపటికల్లా తొలగించిన ఓటర్ల డేటా ఇవ్వండి

ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: బీహార్‌లో తుది ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (సీఈసీ) సుప్రీంకోర్టు ఆదేశించింది. అక్టోబర్ 9 నాటికి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాలని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమల్యా బాగ్చీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. దీనిపై స్పందించిన ఈసీ, ఎస్ఐఆర్‌లో భాగంగా విడుదల చేసిన తుది జాబితాలో చాలా మంది కొత్త ఓటర్లు ఉన్నారని సుప్రీంకోర్టుకు చెప్పింది. ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదు, అప్పీల్ రాలేదని కోర్టుకు తెలిపింది.

"కోర్టు ఆదేశాలు ఎన్నికల ప్రక్రియకు మరింత పారదర్శకతను కల్పిస్తాయి. ముసాయిదాలో 65 లక్షల ఓట్లను తొలగించినట్లుగా కనిపిస్తోంది. ఎవరు చనిపోయినా, వలస వెళ్లినా తొలగించండి. దానికి ఎలాంటి

- మిగతా 2 లో

ఐక్యంగా ముందుకెళదాం

తేజస్వీ యాదవ్‌తో భేటీలో డి.రాజా | సీట్ల సర్దుబాటుపై సుదీర్ఘ చర్చ

బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా బీహార్ రాజధాని పట్నాలో ఆర్‌జేడీ నాయకుడు, మహాకూటమి సమన్వయ కమిటీ చైర్మన్ తేజస్వీ యాదవ్‌తో మంగళవారం భేటీ అయ్యారు.

2 లో

గ్రూప్-1 నియామకాల నిలిపివేతకు సుప్రీం నిరాకరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గ్రూప్-1 నియామకాలపై స్టే విధించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ నియామకాలపై హైకోర్టు బెంచ్ మధ్యంతర తీర్పు వెలువరించి నందున జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని తేల్చి చెప్పింది. గ్రూప్-1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించడంపై స్టే విధించాలని వారు కోరగా ధర్మాసనం నిరాకరించింది.



భౌతికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోం: భౌతికశాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ బహుమతి లభించింది. అమెరికాకు చెందిన జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్ డెవొరెట్, జాన్ ఎం. మార్టినిస్ ఈ పురస్కారం అందుకోనున్నారు. ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో మాక్రోస్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌లో ఆవిష్కరణలకుగాను స్టాక్‌హోంలోని రాయల్ స్వీడిష్ అకాడమీ వీరికి ఈ పురస్కారాలు ప్రకటించింది. గతేడాది ఆర్టిఫిషి యల్ న్యూరల్ నెట్‌వర్క్‌తో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణలకుగాను ఇద్దరికి నోబెల్ దక్కింది. జాన్ జె.హోప్‌ఫీల్డ్,

- మిగతా 2 లో

బీసీ రిజర్వేషన్ల అంశం ప్రతిష్టాత్మకం

హైకోర్టులో వాదనలు వినిపించాలని అభిషేక్ సింఘ్వీని కోరిన సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీసీలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై అడుగడుగునా జాగ్రత్తలు చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం... సుప్రీంకోర్టు, హైకోర్టులోను కేసు గెలిచేందుకు తన సర్వశక్తులు ఒడ్డుతోంది. సోమవారం సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు విచారణ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి బృందం ముందు రోజే దిల్లీ వెళ్లి న్యాయ నిపుణులు, ఉన్నతాధికారులతో చర్చించింది. బీసీ రిజర్వేషన్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సోమవారం సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయ కోవిదుడు అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవేలు హాజరు కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తోపాటు మంత్రుల బృందం సుప్రీంకోర్టుకు వెళ్లి వాదనలు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. బీసీ రిజర్వేషన్ల కేసుపై ఈనెల 8న విచారణ జరగనున్న నేపథ్యంలో స్వయంగా కోర్టుకు హాజరు కావలసిందిగా న్యాయ కోవిదుడు అభిషేక్ సింఘ్వీని ఫోన్లో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం సింఘ్వీని ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.

పలస్తీనా ప్రజలకు వెల్లువెత్తిన సంఘీభావం

వామపక్షాలు, ప్రజాసంఘాల భారీ ప్రదర్శన

విశాలాంధ్ర-హైదరాబాద్: వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతృత్వంలో ఏర్పడిన పలస్తీనా సంఘీభావ కమిటీ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని అశోక్ నగర్ నాలా నుండి ఇందిరా పార్కు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనకారులు 'అమెరికా సామ్రాజ్య వాదం నశించాలి', 'ఇజ్రాయిల్ దురహంకార వైఖరి నశించాలి', 'నెతన్యాహును శిక్షించాలి', 'పలస్తీనాకు స్వాతంత్ర్య ఇవ్వాలి' అంటూ నినదించారు. అనంతరం జరిగిన సభలో అజీజ్ పాషా (సీపీఐ), జాన్ వేస్లీ (సీపీఎం), కె. రమ -సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్, బి. ప్రదీప్, ఆరెల్లి కృష్ణ-సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, గాదరగోని రవి (ఎంసీపీఐ), మురహరి (ఎస్‌యూసీఐ), అజీజ్-ఎంపీజే నాయకులు, ఖలీదా పర్వీన్ (జమాతె హింద్), కేవీఎల్. (ఎ.ఐ పి.ఎస్.ఓ), ప్రొఫెసర్ అన్సారీ, సర్ఫరాజ్ (ఎస్ఐఓ), భార్గవి (ఐపీఎస్‌పీ), బోస్ (ఏఐపీఎఫ్) తదితరులు ప్రసంగించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సీపీఎం నాయకులు మహేందర్, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ గ్రేటర్ కార్యదర్శి ఎం. హన్మేశ్, ఝాన్సీ-సీపీఐ (ఎం.ఎల్) ఎన్.డి. జిల్లా కార్యదర్శి, అనిల్ కుమార్ (ఎంసీపీఐ), తేజ్ (ఎస్‌యూసీఐ (సి)), విజయ్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ, ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ

- మిగతా 2 లో

డిజిటల్ వ్యవసాయంలో దూసుకుపోదాం

- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలతో చిన్న, సన్నకారుల రైతుల అనుసంధానం
- సాగు వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యం
- మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్: డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తమ సంకల్పమని వివరించారు. సాగులో నూతన ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. కృత్రిమ మేథ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ప్రతినిధుల బృందంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంది. రాష్ట్ర జనాభాలో సుమారు 55 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు తన చేయూతను అందిస్తోంది. మరోవైపు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ కు రాష్ట్రం గ్లోబల్ హబ్ గా మారింది. ఇలాంటి తరుణంలో డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను ఆదర్శంగా నిలపాలని సంకల్పించాం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పైగా... సాగులో పురుగు మందుల వినియోగం పెరిగి పర్యావరణానికి ఎంతో హానీ జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పెట్టుబడి వ్యయం, పురుగు మందుల

- మిగతా 2 లో

న్యాయవ్యవస్థ సమగ్రతను కాపాడాలి

టీపీసీసీ లీగల్ సెల్ - సీజేఐపై దాడికి నిరసన

విశాలాంధ్ర-హైదరాబాద్: సీజేఐ బీఆర్ గవాయ్ పై జరిగిన దాడిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ తీవ్రంగా ఖండించింది. చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ హైకోర్టు గేట్ నెం.6 వద్ద మంగళవారం నిరసన తెలిపింది. పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్య స్తంభాలపై దాడి చేసినట్లేనన్నారు. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, సమగ్రతను కాపాడే దిశగా న్యాయవాదులు, ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. నిరసనలో భాగంగా న్యాయపరమైన విలువలు, రాజ్యాంగ పరిరక్షణపై నిబద్ధతను న్యాయవాదులు, టీపీసీసీ లీగల్ సెల్ సభ్యులు పునరుద్ఘాటించారు. మొమిన్ రోషన్ జమీర్, కురుమ నరేందర్, అభిలాష్ ఆశ్రిత్, కమలాకర్, రాజేంద్ర ప్రసాద్, ముజక్కిర్, హైదర్, బాలాజీ, రాజ్‌కుమార్, ఇనాయతుల్లా, లుక్మాన్ అలీ, శిబా రాణి, సంతోష్, మహేష్, శారద, ప్రభాకర్, సిలం, రాఘవేంద్ర రెడ్డి, నర్సింగ్, హరిందర్ సింగ్, ఇతర అభిమత సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సకాలంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి

- సాంకేతిక పారదర్శకత, సంస్థాగత జవాబుదారీతనంతో పనులు
- ఎన్‌డీఎస్ఏ నివేదికల ప్రకారమే కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
- మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర-హైదరాబాద్: పెండింగ్ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సాంకేతిక పారదర్శకత, సంస్థాగత జవాబుదారీతనంతో పనులు జరగాలన్నారు. డాక్టర్ బీఆర్ తెలంగాణ సచివాలయంలో మంగళవారం సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం అనంతరం విలేకరులతో ఉత్తమ్ మాట్లాడారు. ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు, శ్రీకాకుళం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నల్... కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సందిల్లా బ్యారేజీల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మిడిహట్టి భాగాన్ని మొదటి అంశంగా తీసుకుంటూ, ఇంజనీరింగ్ బృందాలు రెండు ప్రత్యామ్నాయ కాలువ మార్గాలను పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఈనెల 22వ తేదీకి తుది నిర్ణయం

- మిగతా 2 లో

కాంగ్రెస్ పాలన మోసాలమయం: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలైనా ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీ ఏ ముఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గత శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రమంతటా ఒకలా ఫలితాలు వస్తే... హైదరాబాద్‌లో మాత్రం ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీకి ఇవ్వకుండా, అన్నీ సీట్లు బీఆర్ఎస్ పార్టీకే ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. 22 నెలల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం రాష్ట్ర ప్రజలందరికీ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రజలకు ఇంకా బాగా అర్థమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. కొత్త రోడ్లు వేయడం, కొత్త బ్రిడ్జిలు కట్టకపోగా... ఉన్న రోడ్లను కూడా కనీసం నిర్వహించే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని ఆయన విమర్శించారు. ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు కాబట్టి అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్న

- మిగతా 2 లో

ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం

- లబ్ధిదారులే నిర్మాణ కర్తలు
- ఖర్గేకు వివరించిన మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక విధానం, చెల్లింపులు, ఒక్కో ఇంటికి అయ్యే వ్యయం తదితర అంశాలపై ఖర్గే మంత్రిని అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పేదలకు ఐదు లక్షల రూపాయిలతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చూడండి..ఎలా బుకాయిస్తున్నారో మద్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఉంది కదాని ఇందులో దిగారట!

అమెరికాకు పాక్ అరుదైన ఖనిజాలు

తొలి బ్యాచ్ సరఫరా

షిప్‌మెంట్ కోసం అరేబియా సముద్రంలో పోర్టు

ఇస్లామాబాద్: అమెరికాతో చేసుకున్న కీలక ఒప్పందంలో భాగంగా తమ అరుదైన ఖనిజాలా తొలి బ్యాచ్‌ను ఆ దేశానికి పాకిస్థాన్ సరఫరా చేసింది. సెప్టెంబరులో అమెరికాకు చెందిన యూఎస్ స్ట్రాటజిక్ మెటల్స్ (యూఎస్ఎస్ఎం)తో 500 మిలియన్ డాలర్ల ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా మొదటి కన్‌సైన్మెంట్ వెళ్లింది. ఆధునిక సాంకేతికతలకు, ఎలక్ట్రిక్ వాహనాలకు, రక్షణ వ్యవస్థలకు అవసరమైన కీలక ఖనిజాల కోసం ఈ ఒప్పందం చేసుకుంది. పాకిస్థాన్‌లో ఖనిజ శుద్ధి, అభివృద్ధి సౌకర్యాల ఏర్పాటు కోసం పెట్టుబడి పెట్టేందుకు యూఎస్ఎస్ఎం ముందుకొచ్చింది. తాజా పరిణామం పాకిస్థాన్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలక మైలురాయిగా ఆ సంస్థ సీఈఓ స్టైసీ డబ్ల్యూ హెస్టీ వెల్లడించారు. ఇది ఖనిజాల సరఫరా గొలుసులో సహకారానికి మార్గాన్ని నిర్దేశిస్తుందన్నారు. ప్రపంచ ఖనిజాల మార్కెట్‌లో పాకిస్థాన్‌కు స్థానం కల్పించేందుకు ఇది దోహదమైందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా పాకిస్థాన్‌కు భారీగా ఆదాయం సమకూరగలదని, ఉపాధి కల్పన, సాంకేతికతలను ఇచ్చిపుచ్చుకునేందుకు దోహదం కాగలదని తెలిపాయి. పాకిస్తాన్ ఉపయోగించని ఖనిజ నిల్వలు ఆరు ట్రిలియన్ డాలర్లు అంటే రూ.6 లక్షల కోట్లన్న అంచనా ఉంది. అరుదైన ఖనిజాల ఎగుమతితో అమెరికాకు అవసరమైన ముడి పదార్థాల లభ్యత పెరుగుతుంది. ప్రపంచ ఖనిజాల మార్కెట్‌ను నియంత్రించే ఇతరులపై ఆధారం తగ్గించుకునే వీలు కలుగుతుంది. అయితే, ఈ ఒప్పందంపై ప్రతిపక్ష పాకిస్తాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) అభ్యంతరం తెలిపింది. అమెరికాతో రహస్య ఒప్పందాల పూర్తి వివరాలు విడుదల చేయాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. యూఎస్ స్ట్రాటజిక్ మెటల్స్ సరుకు రవాణా, పాస్ని పోర్ట్‌ను అమెరికాకు అప్పగించే ప్రతిపాదనలు ఉన్నాయనే వార్తా కథనాలను ప్రస్తావించింది. అనాలోచిత, ఏకపక్ష, రహస్య ఒప్పందాలు పాకిస్థాన్‌లోని అస్థిర పరిస్థితులను మరింతగా దిగజార్చుతాయని హెచ్చరించింది. మరోవైపు అరేబియన్ సముద్రంలోని పాస్ని పోర్టును అరుదైన భూ ఖనిజాలా సరఫరాను మరింత సులభం చేసేందుకుగాను వినియోగించేందుకు అమెరికాకు పాకిస్థాన్ అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రతిపాదించింది. గదర్ నుంచి 70 మైళ్లు... పాకిస్థాన్-ఇరాన్ సరిహద్దు నుంచి 100 మైళ్లు ఉండే ఈ పోర్టు కోస్తా పట్టణం పాస్నీలో ఉంది. ఇది అరుదైన ఖనిజాల సరఫరాకు కీలకం. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ ఇటీవల అమెరికాలో పర్యటించినప్పుడు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌ను కలిశారు. తమ అరుదైన భూ ఖనిజాల నమూనాలను ట్రంప్‌కు చూపించారు. ఇందుకు సంబంధించిన ఫొటో బయటకొచ్చింది. కాగా, భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని వాణిజ్యం ద్వారా ఆపిన తనకు నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వాలంటూ ట్రంప్ ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో తాజా పరిణామాలకు, రెండు దేశాల మధ్య పెరిగిన సఖ్యతకు ప్రాధాన్యత ఏర్పడింది.

1 నుంచి ట్రక్కులపై 25 శాతం సుంకం: ట్రంప్

న్యూయార్క్: మధ్యశ్రేణి, భారీ ట్రక్కులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. నవంబరు 1 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపారు. ఈ మేరకు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో వెల్లడించారు. అమెరికాకు అధికంగా ట్రక్కులను ఎగుమతి చేసే దేశాల్లో మెక్సికో, కెనడా, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్ టాప్ 5లో ఉన్నాయి. అమెరికాలో తయారు చేయని భారీ ట్రక్కులపై అక్టోబరు 1 నుంచి 25 శాతం సుంకం విధిస్తామని సెప్టెంబరు 25న ట్రంప్ ప్రకటించారు. అమెరికాలోని ట్రక్కు డ్రైవర్లకు ఆర్థిక భరోసా ఇవ్వాల్సిన అవసరం దృష్ట్యా ఈ మేరకు నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. సరఫరా గొలుసులకు విఘాతం కలుగుతుందని, వ్యయం పెరుగుతుందని అమెరికాకు చెందిన ప్రధాన ఆటోమేకర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో సుంకాల అమలు ఆలస్యమైంది.

ప్రభావవంతంగా మాట్లాడి ఆపా...

సుంకాలతో ఆదాయమే కాదు శాంతి కూడా

వాణిజ్యం అడ్డుపెట్టి భారత్-పాక్ యుద్ధాన్ని ముగించా: ట్రంప్

వాషింగ్టన్: తాను చాలా ప్రభావవంతంగా మాట్లాడటం వల్లే భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణ ఆగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు గొప్పలు పోయారు. వాణిజ్యాన్ని అడ్డుపెట్టి రెండు అణుశక్తుల మధ్య యుద్ధాన్ని ఆపినట్లు ఆయన చెప్పుకున్నారు. సుంకాలు అమెరికాకు చాలా ముఖ్యమని, అవి శాంతిని పరిరక్షిస్తున్నాయ వెల్లడించారు. అమెరికాకు కొన్ని వందల బిలియన్ల డాలర్లు తెచ్చి పెట్టడమే కాకుండా శాంతి పరిరక్షలుగా సుంకాలు ఉన్నాయి అని ఓవర్ కార్యాలయంలో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ అన్నారు. సుంకాల అధికారాన్ని తాను వినియోగించి ఉండకపోతే ఇప్పటికీ నాలుగు యుద్ధాలు కొనసాగేవని చెప్పారు. 'సుంకాల ద్వారా యుద్ధాలను ఆపగలిగాను. మీరు భారత్, పాకిస్థాన్ సంగతే తీసుకోండి. ఆ దేశాలు ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు... ఢీ అంటే ఢీ అన్నాయి. ఈ క్రమంలో ఏడు యుద్ధవిమానాలు కూలాయి. అవి అణ్వస్త్రాలు ఉన్నా దేశాలు. నేను కచ్చితంగా ఏం మాట్లాడానో చెప్పను కానీ సమర్థంగా, ప్రభావవంతంగా మాట్లాడి ఆ దేశాలను ఆపాను. సుంకాలు, వాణిజ్యం ఆధారంగానే అలా చేయగలిగాను' అని ట్రంప్ వెల్లడించారు. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని ట్రంప్ అనేక సందర్భాల్లో చెప్పారు. అలాగే కంబోడియా-థాయిలాండ్, కోసోవో-సెర్బియా, కాంగో-ర్వాండా, ఇజ్రాయిల్-ఇరాన్, ఈజిప్టు-ఇథియోపియా, అర్మేనియా-అజర్‌బైజన్ మధ్య యుద్ధాలను ఆపానంటూ ట్రంప్ పదేపదే చెప్పుకున్నారు. తద్వారా నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందాలని ఆకాంక్షిస్తున్నారు.

ఐక్యంగా ముందుకెళదాం

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా బీహార్ రాజధాని పట్నాలో ఆర్‌జేడీ నాయకుడు, మహాకూటమి సమన్వయ కమిటీ చైర్మన్ తేజస్వీ యాదవ్‌తో మంగళవారం భేటీ అయ్యారు. బీహార్‌లో వామపక్షాలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు బలం పెంచుకోవడంపై చర్చించారు. బీహార్‌లో 24 స్థానాల్లో పోటీ చేయాలని సీపీఐ ప్రతిపాదించింది. అయితే దీనిపై రాజా, తేజస్వి మధ్య సుదీర్ఘమంతనాలు జరిగాయి. ప్రజలు మెచ్చే రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నారు.

ఐక్యంగా, బలంగా ముందుకెళదామని, ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని డి.రాజా అన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, జాతీయ కార్యదర్శి సంజయ్ కుమార్, జాతీయ సమితి సభ్యుడు అజయ్ కుమార్ సింగ్, ఆర్‌జేడీ నాయకులు అబ్దుల్ బారి సిద్దిఖీ, సంజయ్ యాదవ్ (ఎంపీ), ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మగ్నీలాల్ మండల్, జాతీయ ప్రధాన కార్యదర్శి భోలా యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సీట్ల సర్దుబాటుపై మరోసారి సమావేశం కావాలని రెండు పార్టీల నేతలు నిర్ణయించుకున్నారు.

3.66 లక్షల ఓట్ల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరం లేదు. కానీ ఎవరినైనా ఓటరుగా తొలగిస్తుంటే అందుకు సంబంధించిన రూల్-21 ప్రకారం అనుసరించండి. ఎవరినైనా తొలగిస్తే వారి వివరాలను ఎన్నికల కార్యాలయాల్లో పెట్టాలని కూడా చెప్పాం. తాజాగా విడుదల చేసిన తుది జాబితాతో ముసాయిదాను పోల్చి చూస్తే ఓటర్ల సంఖ్యలో తేడాలు ఉన్నాయి. ఈ గందరగోళాన్ని నివారించడానికి ఈ వివరాలను బహిర్గతం చేయండి." అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. నవంబర్ 6, 11 తేదీల్లో బీహార్‌లో పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలపై దాఖలైన వివిధ పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. "ఎస్ఐఆర్ ప్రక్రియ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా వాటిని మరింత జటిలం చేసింది... పూర్తిగా పారదర్శకత లోపించింది. కోర్టు ఆదేశాలు జారీ చేసిన తర్వాతే 65 లక్షల మంది తొలగించబడిన ఓటర్ల గురించి సమాచారం ఇవ్వబడింది. నిబంధనల ప్రకారం వారు సమాచారాన్ని అప్‌లోడ్ చేయలేదు" అని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు వాదించారు. ఈ క్రమంలో తుది జాబితా నుండి పేరు తొలగించబడిన ఏ వ్యక్తి అయినా కోర్టు జోక్యాన్ని కోరవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. కాగా, తదుపరి చట్టపరమైన చర్య తీసుకునే ముందు తమకు మరింత సమాచారం అవసరమని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరుతున్నారు. ఎన్నికల సంఘం జూన్ 25న బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రకటించినప్పుడు మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లుండగా... 68.66 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. ఈ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన తుది జాబితాలో కొత్తగా 21.53 లక్షల మంది ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చగా... మొత్తం ఓటర్ల సంఖ్య 7.43 కోట్లకు చేరుకుంది. కాగా విచారణ సందర్భంగా జస్టిస్ బాగ్చి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఎన్నికలసంఘం తరపున హాజరైన న్యాయవాది రాకేశ్ ద్వివేది సమాధానమిస్తూ ఓటర్ల జాబితాలో చేర్చినవారిలో ఎక్కువ మంది కొత్తవారేనని ధర్మాసనానికి తెలియజేశారు. "65 లక్షల ఓటర్ల తొలగింపు జరిగింది. మీరు ఎవరినైనా తొలగించినట్లయితే దయచేసి వారి డేటాను మీ జిల్లా ఎన్నికల కార్యాలయాల్లో ఉంచమని మేము చెప్పాము. ఇప్పుడు మీకు తుది జాబితా వచ్చింది. తుది జాబితా సంఖ్య పెరిగినట్లు కనిపిస్తోంది"అని జస్టిస్ బాగ్చి అన్నారు. "ఇది 65 లక్షల నుండి పెరిగింది. ఇప్పుడు ఒక గందరగోళం ఉంది. ఈ చేరికలు ఎక్కడినుంచి వచ్చాయి? వీరు తొలగించబడినవారి నుంచి వచ్చారా? లేక కొత్త పేర్ల చేర్పింపా మాకు స్పష్టత అవసరం" అని బాగ్చీ స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం ఈ కేసుపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనుంది.

పలస్తీనా ప్రజలకు వెల్లువెత్తిన సంఘీభావం

(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలుగా ఇజ్రాయిల్, పలస్తీనాపై దాడులు చేస్తోందన్నారు. ఇజ్రాయిల్ దేశం ఏర్పడిన 1948 నుండే కక్షపూరితంగా, అమెరికా వత్తాసుతో పలస్తీనాపై దాడులూ, యుద్ధాలు చేస్తోందన్నారు. గత 2 సంవత్సరాలుగా 70 వేల మంది పలస్తీనా ప్రజల్ని హత్యగావించారన్నారు. అందులో సగం పిల్లలు, మహిళలూ, వృద్ధులేనని తెలిపారు. సగటున రోజుకు వంద మంది సామాన్య ప్రజల్ని బలితీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది జర్నలిస్టులను హత్యకు గురవతున్నారన్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ పూర్తిగా గజాను ఆక్రమించిందని... 20 లక్షల జనాభాను ఖాళీ చేయించి, రిసార్టు నిర్మిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించడం దుర్మార్గమని పేర్కొన్నారు. గజాపై దాడులు ఆపాలనీ ముక్తకంఠంతో ప్రపంచం మొత్తం హెూరెత్తినా చలించడం లేదన్నారు. ఆహారం, నీరు, ముడి సరుకులు అందుబాటులో లేకుండా చేసి ప్రజలను చంపుతున్నారన్నారు. ఐక్యరాజ్య సమితి, ఇతర దేశాల ఆహార ట్రక్కులను సరిహద్దుల్లో ఆపడం, వాటి కోసం ఎదురుచూస్తున్న ప్రజల్ని వెంటపడి చంపడాన్ని సమాజం ఏ విధంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. వెంటనే పలస్తీనాపై దాడులు నిలిపివేసి 145 దేశాలు గుర్తించినట్లుగానే, ఇజ్రాయిల్, అమెరికాలు గుర్తించాలని డిమాండ్ చేశారు. పలస్తీనా ప్రజలకు హైదరాబాదీల తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామని ప్రకటించారు. ప్రపంచం గజాను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాగర్, డి.జి. నరసింహారావు, అబ్బాస్ (సీపీఎం), ధర్మేంద్ర, వలివుల్లా ఖాద్రి (సీపీఐ), కె. సూర్యం, ఎస్.ఎల్. పద్మ, సదానందం (మాస్ లైన్), జె.వి. చలపతిరావు, అరుణ, అనురాధ (న్యూడెమోక్రసీ), వీక్షణం వేణుగోపాల్, రవిశర్మ, సజయ్, కన్నెగంటి రవి, వినాయక రెడ్డి. పెద్ద సంఖ్యలో వామపక్షాలు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునే సదుపాయాన్ని కల్పించింది. ఇళ్ల పథకాలలో కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఐదు లక్షల రూపాయిలతో నాలుగు వందల చదరపు అడుగులు తగ్గకుండా ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకునేలా పథకం రూపొందించామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. రాష్ట్రంలో గడచిన పదేళ్లలో పేదలు ఆశించిన మేరకు ఇళ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లకు డిమాండ్ అధికంగా ఉందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మొదటి దశలో ఈ ఏడాది 22,500 కోట్ల రూపాయిలతో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున 4.50 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, లబ్ధిదారుల ఎంపిక పూర్తికాగా...దాదాపు 3.5లక్షలకు పైగా ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు.దీనికి ఖద్దే స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు బాగుందని...ఇదే విధంగా ముందుకు సాగాలని మంత్రి పొంగులేటిని అభినందించారు.

చంద్రబాబుతో టీటీడీపీ నేతల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నరసింహులు తదితరులు వచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో టీడీపీ నేరుగా పోటీ చేయాలా? లేక బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలా? అనే అంశంపై ఈ సమావేశంలో చంద్రబాబు వారు ప్రస్తావించారు. జూబ్లీహిల్స్‌లో టీడీపీ బలంగా ఉందని, పోటీ చేస్తే బావుంటుందని నేతలు అధినేతకు సూచించగా, ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యపక్షంగా ఉన్న కారణంగా మనం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని చంద్రబాబు వారికి చెప్పినట్లు తెల్సింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి టికెట్ ఆశించే అభ్యర్థులు, ఆయా పార్టీల బలాబలాలపై కూడా ఈ సమావేశంలో చర్చకొచ్చినట్లు తెల్సింది. ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి అభ్యర్థి గెలుపుకు కృషి చేయడం అవసరమని, అందుకోసం టీడీపీగా చేయాల్సిన కృషిపై తెలంగాణ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేసినట్లు తెల్సింది. స్థానిక ఎన్నికపై ఇంకా సమయం ఉన్నందున మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

- కోఠి, ఖైరతాబాద్, లక్డీకాపూల్ ప్రాంతాల్లో కుండపోత
- రోడ్లపై నిలిచిన నీరు, స్తంభించిన ట్రాఫిక్

విశాలాంధ్ర-హైదరాబాద్: రోజంతా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోయిన హైదరాబాద్ నగర వాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఒక్కసారిగా ఉపశమనాన్నిచ్చింది. అయితే, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. అరగంట పాటు దంచికొట్టిన కుండపోత వానకు నగరం అతలాకుతలమైంది. అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయం కావడంతో జనజీవనం స్తంభించింది. నగరంలోని ప్రధాన కేంద్రాలైన కోఠి, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్‌తో పాటు రాజేంద్రనగర్, గండిపేట్ వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే కీలక సమయంలో వర్షం ముంచెత్తడంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ప్రజలు గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షించాల్సి వచ్చింది. మరోవైపు, నగరంలోని గచ్చిబౌలి, రాయదుర్గం, పంజాగుట్ట, అమీర్‌పేట్‌తో పాటు పాతబస్తీలోని చార్మినార్, ఫలక్‌నుమా వంటి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం నమోదైంది.

డిజిటల్ వ్యవసాయంలో దూసుకుపోదాం

(మొదటిపేజీ తరువాయి)

వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగానే మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది' అని వివరించారు. అత్యాధునిక సెన్సార్ల ద్వారా నేల స్వభావాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చునని, ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చని చెప్పారు. ఫలితంగా రసాయనాల కొనుగోలు ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా వేములవాడకు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్‌ఐ' అధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్-రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం (న్యూఢిల్లీ) ఫుడ్, అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్ హెచ్ ఐ ప్రతినిధులు డా. సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుందని ఉత్తమ్ అన్నారు. ఎస్ఎల్‌బీసీని 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. ప్రతి 15 రోజులకు సమీక్షలు, సాంకేతికాధారిత సర్వేలతో భద్రత, నాణ్యతకు హామీనిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మెడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణ ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం జరుగుతోందన్నారు. 'ప్రధాన ఐఐటీ బృందం నిర్మాణ రూపకల్పన, పరీక్షలు, పునరుద్ధరణ ప్రణాళికను చేపడుతుంది. వర్షాకాలానికి ముందు పరీక్షలు పూర్తయ్యాయి. పునరుద్ధరణ రూపకల్పన ఏడాదిలో జరుగుతుంది' అని ఉత్తమ్ తెలిపారు. పునరు ద్ధరణ ప్రక్రియ ఎన్‌డీఎస్ఏ సిఫారసులకు అనుగుణంగా ఉంటుందన్నారు. బ్యారేజీల భద్రత అత్యంత ప్రాధాన్య మని, ప్రతి దశలో జాతీయ స్థాయి సంస్థలు పాల్గొంటూ శాస్త్రీయ, పారదర్శక, సవరణాత్మక విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. న్యాయ అంశాల పరంగా కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ విచారణల పురోగతిని మంత్రి సమీక్షించారు. ప్రతి సమావేశానికి సంబంధించిన సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, ఢిల్లీలోని న్యాయ బృందంతో- సుప్రీంకోర్టులో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే న్యాయవాదులతో సమన్వయం, వాదనల్లో ఏకరూపత ఉండాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టు కోసం కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ)ను సంప్రదించి నీటి కేటాయింపు- టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం కోరినట్లు తెలిపారు. దేవదుల ప్రాజెక్టు శాఖ ప్రధాన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఒకటని, భూ సేకరణ పరిహారంగా రూ.33 కోట్లు విడుదల చేయాలని ఆదేశించి, అంచనాలను (ఆర్‌ఈలు) ఈ నెలలో ఆమోదించాలని సూచించారు. డిండి ప్రాజెక్టుపై సమగ్ర సమీక్షా నివేదిక సిద్ధం చేయాలని, భౌతిక పురోగతి, నిధుల వినియోగం, పెండింగ్ పనుల గురించి నివేదిక మూడు రోజులలో సమర్పించాలన్నారు. నీటి పారుదల రిజర్వాయర్ల మట్టిని తొలగించడం, రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మెరుగుపరచే స్వయం సమర్థ విధానాన్ని రూపొందించడం పైనా సమీక్షించారు. అదనపు ఇంజనీర్ల నియామకం, హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్, ఆధునిక రూపకల్పన సాఫ్ట్‌వేర్ వినియో గం, అన్ని ప్రధాన రిజర్వాయర్లు నిండుగా ఉంచాలని, హైడ్రాలజికల్ సీజన్ ముగిసే వరకు టెలిమెట్రీ ఆధారిత పర్య వేక్షణ కొనసాగించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

భౌతికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

జెఫ్రీ ఈ.హింటన్ దీనిని స్వీకరించారు. మొత్తంగా 1901-2024 మధ్యకాలంలో 118 సార్లు భౌతికశాస్త్రంలో నోబెల్‌ను ప్రకటించగా... 226 మంది దీన్ని అందుకున్నారు. వీరిలో లారెన్స్ బ్రాగ్ 25 ఏళ్ల వయసులోనే ఈ నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడిగా నిలువగా... ఆర్థర్ అష్కిన్ 95 ఏళ్ల వయసులో నోబెల్ అందుకున్న వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. నోబెల్ పురస్కారాల ప్రకటన అక్టోబర్ 13 వరకు కొనసాగనుంది. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య విభాగంలో విజేతలను ప్రకటించనున్నారు. శుక్రవారం శాంతి బహుమతితో పాటు అక్టోబర్ 13న ఆర్థికశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను వెల్లడిస్తారు.

కాంగ్రెస్ పాలన మోసాలమయం

(మొదటిపేజీ తరువాయి)

లక్షా 20 వేల మంది ఆటో డ్రైవర్లను అడిగితే కాంగ్రెస్ ఏ రకంగా వాళ్ళ కడుపు మీద కొట్టిందో చెప్తారన్నారు. అట్లాగే... మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇక్కడ హైదరాబాద్‌లో ఉండే యువతను మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులకు నెలకు రూ. 4,000 పెన్షన్ ఇస్తాని చెప్పారని... ఏ ఒక్క వాగ్దానం కూడా అమలు చేయలేదని... ఏం ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందని నిలదీశారు. జూబ్లీహిల్స్‌లో తమ పార్టీ అభ్యర్థి తిరిగి మంచి మెజారిటీతో గెలుస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

బస్సుపై కొండ చరియలు

18 మంది మృతి- హిమాచల్‌లో ఘటన

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో భారీగా కొండచరియలు విరిగిపడి ప్రైవేటు బస్సుపై పడ్డాయి. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పో యారు. ఝూందత్తా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని భాలుఘాట్‌లో మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 35 మంది వరకు ఉన్నట్లు వెల్లడించారు. హర్యానాలోని రొహతక్ నుంచి ఘోమర్విన్‌కు వెళుతున్న క్రమంలో ప్రమాదం జరిగిందన్నారు. పోలీసులు, జిల్లా అధికారులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నట్లు వెల్లడించారు. శిథిలాల కింద నుంచి 18 మృతదేహాలు వెలికి తీసినట్లు చెప్పారు. కొండ మొత్తం విరిగిపడిం దని, ప్రాణ నష్టం ఎక్కువగానే ఉంటుందని సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది అన్నారు. ఈ ఘటనపై సీఎం సుఖ్విందర్ సింగ్ సుకూ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టాలని, సాధ్యమైనంత ఎక్కువ మందిని కాపాడేందుకు ప్రయత్నించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారిక ప్రకటన పేర్కొంది. కాగా, సోమవారం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండటంతో ఈ ఘటన జరిగిందని అధికారులు వెల్లడించారు.

వరల్డ్ బర్డ్ ఫొటోగ్రఫీలో బైజు పాటిల్‌కు సిల్వర్ అవార్డు

ముంబై: మహారాష్ట్రకు చెందిన బైజు పాటిల్ వరల్డ్ అంతర్జాతీయ స్థాయిలో బర్డ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ 2025లో సిల్వర్ అవార్డు పొందారు. ప్రపంచవ్యాప్తంగా 33వేల మంది ఫొటోగ్రాఫర్లు 50 లక్షల ఫొటోలు పంపించగా, పాటిల్‌కు అవార్డు దక్కింది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా నిలిచారు. అహల్యానగర్ జిల్లాలోని హావాడే బజార్‌లోని పొలంలో బంతిపూలపై పక్షులు వాలడాన్ని గమనించి.. రెండు గంటలు కష్టపడి తన కెమెరాలో ఆ దృశ్యాన్ని బంధించారు. బ్రిటన్‌లో నిర్వహించిన వరల్డ్ బర్డ్ ఫొటోగ్రాఫర్స్ పోటీల్లో పాల్గొని అవార్డు కైవసం చేసుకున్నారు. పన్నెండేళ్లుగా ప్రయత్నిస్తుంటే ఇప్పటికి అవార్డు రావడం అమితానందాన్ని ఇచ్చిందన్నారు.బైజు పాటిల్ వన్యప్రాణుల చిత్రాలు తీస్తారు. 165 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రామాయణాన్ని రచించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి అన్నారు. వాల్మీకి రచనల్లోని విలువలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకలలో ఆర్డీవో రత్నకళ్యాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, మత్స్యశాఖ ఏడి రాజానర్సయ్య, పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, ఎల్డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాస వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో -నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఒకటో నెంబర్ అంగన్వాడీ సెంటర్లో, పోషణ మాసం వారోత్సవాలు, సిడిపిఓ శ్రీలత, ఖానాపూర్ పురపాలక సంఘం కమిషనర్,,ప్రారంభించారు, తదుపరి మాట్లాడుతూ,,గర్భిణీలు బాలిం తలు పిల్లతల్లులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు,ఈ కార్యక్రమాలో సూపర్‌వైజర్ శ్యామల అంగన్వాడీ టీచర్స్ తల్లులు పాల్గొన్నారు.

వాల్మికి మహర్షి జయంతి

విశాలాంధ్ర ప్రతినిధి, పెద్దపల్లి,సింగరేణి: సింగరేణి ఆర్జీ వన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదికవి వాల్మికి మహర్షి జయంతి వేడుకలను జియం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జీ1 జీఎం లలిత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆదికవి వాల్మికి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్, చిలుక శ్రీనివాస్,రవీందర్ రెడ్డి,క్రాంతి, రాంమోహన్, మోహన్‌రావు, హన్మంతరావు, శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ ఇంచార్జ్ రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామగుండం కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా వాల్మికి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ అధికారులు మహర్షి వాల్మికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఐపిఎస్., అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్ ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి, సందీప్ కుమార్, సిసి హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో -ఖమ్మం : మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి ఆధ్యాత్మికవేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారని, రామాయణం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అన్నారు. అనంతరం వక్తలు మహర్షీ వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడికి సీపీఐ నిరసన

విశాలాంధ్ర - కొత్తగూడెం : భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై మతోన్మాద ముసుగులో ఉన్న న్యాయవాది జరిపిన దాడి ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన దాడి గా భావించి ప్రజలు ఖండించాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. సుప్రీమ్ కోర్టు సాక్షిగా ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై జరిగిన దాడిని నిరసిస్తూ సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టాఫీసు సెంటర్లో నిరసన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులతో ఆందోళనకు దిగారు. దాడికి పాల్పడిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. న్యాయవ్యవస్థకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ న్యాయవ్యవస్థకు ప్రతీకగా ఉన్న నేపథ్యంలో దాడి చేయడం వెనక పెద్ద కుట్ర దాగివుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక తమకు అనుకూల తీర్పులు రాకుంటే న్యాయ వ్యవస్థను సైతం బ్లాక్ మెయిల్ లేదా బెదిరింపులు చేసే దుర్మార్గ స్థాయికి మతోన్మాదులు వెళ్లారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలవల్ల న్యాయమూర్తులకే రక్షణ లేకుండా పోయిన్సన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గనిగళ్ల వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, కె. రత్నకుమారి, గౌనె మని, మర్రి గోపి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షహీన్, పుట్టి భాగ్యలక్ష్మి, కైసర్, కత్తెర రాములు, కె ధర్మరాజు, గౌనె సురేష్, గుత్తుల శ్రీనివాస్, బాదావత్ రంజీ, మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి పట్ల మాజీ ఎంపీ నామ ఖండన

విశాలాంధ్ర ఖమ్మం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి సంఘటనను బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. న్యాయవ్యవస్థపై దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు సరికాదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తిపై దాడి ప్రయత్నం జరగడం ఆందోళనకరమని నామ అన్నారు. ప్రజల న్యాయహక్కులను కాపాడే న్యాయమూర్తులపై దాడి ప్రయత్నం దేశ ప్రజాస్వామ్య గౌరవాన్ని దెబ్బతీసిన చర్యగా అభివర్ణించారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టడంలో ప్రభుత్వం, న్యాయవర్గాలు, ప్రజాసంఘాలు సమన్వయంతో ముందుకు రావాలని నామ పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: జిల్లాలో పండించిన ప్రతి నాణ్యమైన గింజను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం ఏటూరు నాగారం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరునాగారం,కన్నాయిగూడెం,మంగపేట, వాజేడు, వెంకటాపురం, తాడ్వాయి, గోవిందరావుపేట పరిధిలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ (వానకాలం) ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా జరగాలని, జిల్లాలో దాదాపు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ఉన్న రైతుల వివరాలు, రైతులు సాగు చేసిన భూ విస్తీర్ణం వివరాలు, వచ్చే పంట దిగుబడి వివరాలు ముందస్తుగా తెలుసుకోవాలని, షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 కంటే తక్కువ తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని, రైతుల ధాన్యం నాణ్యతను వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించి ధ్రువీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డిజిటల్ వేయింగ్ యంత్రాలను మాత్రమే వినియోగిస్తున్నామని, వాటి పనితీరును జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత ఏర్పడితే వెంటనే సమాచారం అందించాలని, సకాలంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే గన్ని బ్యాగుల నాణ్యతను ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పరిశీలించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సైతం గన్ని బ్యాగుల నాణ్యత పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేని, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాం పతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రించాలని నిరసన

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం కార్పొరేషన్‌లో విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్‌ను తక్షణమే నియంత్రించాలని ,ఫుట్ పాత్లపై ఆక్రమణలను తొలగించాలని పార్కింగ్ స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం మాట్లాడుతూ అధికారులు ట్రాఫిక్‌పై ప్రత్యేకదృష్టి సాధించి రోడ్లపై నిలుపుతున్న వాహనాలను తొలిగించాలని ,పార్కింగ్ స్థలము లేక రోడ్లపై అడ్డంగా పెడుతూ ఫుటపాత్ లను ఆక్రమిస్తూ ఎటువైపు వెళ్లాల్సి వచ్చిన తీవ్ర ఇబ్బంది పడాల్సివస్తుందని అవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రు లు, షాపింగ్ మాల్స్, రైతు బజార్లు, పార్కింగ్ స్థలాలు లేక ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. కొన్ని షాపులకు సెల్లార్లు ఉన్నప్పటికీ వాటిని పార్కింగ్ కోసం ఉపయోగించటం లేదని ఆయన ఆరోపించారు. 2టౌన్ ఏరియా కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంభశివరెడ్డి, మాట్లాడుతూ ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారు లకు చలాన్లు వేసి వసూలు చేస్తున్నారు తప్ప సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి జరగటం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాల నర్సింహ రావ్, మంద వెంకటేశ్వర్లు, చానా,. కుమార్,డి. శేఖర్ నాయక్,. సతీష్ రెడ్డి, మీర, రవి,. నాగ, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రస్తావించాలి: సీపీఐ

విశాలాంధ్ర-వనపర్తి : స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన అస్త్రంగా ప్రచారం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు పిలుపునిచ్చారు. వీపనగండ్ల మండలం బొల్లారంలో గ్రామ పార్టీ సర్వసభ్య సమావేశం చల్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు రోడ్లు ఇండ్లు ప్రభుత్వ భూములు భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం తదితర అనేక సమస్యలు ఉన్నాయన్నారు. బిజెపి కాంగ్రెస్ బీఆర్ఎస్ ఎన్నికల హామీలను అమలు చేయలేదన్నారు. బిజెపి మతవిద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలింది అన్నారు. వీటిపై ప్రచారం చేసి ప్రజలను సమస్యలు పరిష్కారానికి పోరాటానికే సమయం చేయాలన్నారు. సిపిఐకి ఎన్నికల్లో గెలవటం, ఓడిపోవడం అన్నది పెద్ద విషయం కాదన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎర్రజెండాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, వంక గోపాల్ సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, వీపనగండ్లమండల పార్టీ కార్యదర్శి కురుమయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్ తిరుపతయ్య కృష్ణయ్య వేమన్న రంజాన్ అలీ రాజా గౌడ్ శివకుమార్ పాల్గొన్నారు.

సహజ సిద్ధ ఎరువులతోనే అధిక దిగుబడులు

విశాలాంధ్ర కారేపల్లి : రైతులు సహజసిద్ధంగా అచ్చి రొట్ట తదితరాలతో తయారు చేసుకున్న ఎరువుల తోనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య అన్నారు.మంగళవారం సింగరేణి మండలంలో గల పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మాణిక్యారం,ఎర్రబోడు గ్రామ పంచాయతీలలో పలు పంట పొలాలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి కొయ్యలను,పత్తి వ్యర్థాలను మొదలగు పంటలను భూమిలో కలయదున్నకుండా కాల్చడం వల్ల కలిగే నష్టాల పట్ల రైతులకు వివరించారు.వరి కొయ్యలను, పత్తి పంటకు సంబంధించిన వ్యర్థాలు కాల్చడం వలన భూమిలో గల సూక్ష్మజీవులు చనిపోవడం జరుగుతుందనీ, దాని వలన భూమి సారవంతం కోల్పోయి పంట పండించు కోవడానికి పనికి రాకుండా పోవడం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఏటీసీ కేంద్రాల పనులను పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలోని రుద్రంపూర్, మణుగూరు లలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) లో జరుగుతున్న పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతి, ల్యాబ్ ఏర్పాట్లు, పరికరాల సరఫరా, విద్యార్థుల శిక్షణ కోసం ఏర్పాట్లు, అవసరమైన మౌలిక సదుపాయాల స్థితిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటీసీ కేంద్రాలు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఏ టి సి కేంద్రాల ద్వారా సాంకేతిక శిక్షణ పొందిన యువత ద్వారా స్థానిక పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదపడతాయని స్పష్టంచేశారు. కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఐటిఐ ప్రిన్సిపల్స్ రమేష్, ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి సీపీఐ ఖండన

విశాలాంధ్ర-నేరేడు చర్ల : జీజేఐ గవాయిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలిపారు. నేరేడుచర్లలో సీపీఐ అనుబంధ ప్రజా సంఘాలైన ఏఐవైఎఫ్ దళితుల హక్కుల పోరాట సమితి బీసీ హక్కుల సాధన సమితి ముఖ్యలతో కలిసి ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి చేయడం అంటే న్యాయ వ్యవస్థపై దాడి చేయడమేనని, మన దేశ ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, మన రాజ్యాంగంపై దాడి చేయడ మేనని ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డ ఆర్ఎస్ఎస్ కార్యకర్త కిషోర్ రాకేష్ పై తీవ్ర చర్యలు తీసుకోవాలని, ఆయన డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పట్ల జస్టిస్ గవాయి తన అభిప్రాయాన్ని తెలియజేశాడని అది అతనికున్న వాక్ స్వాతంత్రంలో భాగమని గుర్తించకుండా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారు అనే వంకతో న్యాయమూర్తి పైన కాలి బూటుతో దాడి చేయడాన్ని దేశ ప్రజలందరూ గమనించాలన్నారు. సనాతన ధర్మానికి కాలం చెల్లిపోయిందని, గవాయ్ అభిప్రాయపడితే భౌతిక దాడికి దిగుతారా అని ఇదేనా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అని ఇదే నా దేశభక్తి అంటే అని ఇలాంటి దేశద్రోహులవల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశం తలదించుకునే పరిస్థితి దాపురిస్తుందని ఈ దేశంలో మాట్లాడే అర్హతను ప్రజలు కోల్పోయారా అనే అనుమానం వస్తుందని అతడు ఏదైనా తప్పు మాట్లాడితే న్యాయపరమైన... చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప భౌతిక దాడులకు దిగటం అది కోర్టు హాల్లోనే సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తి పైన దాడి చేయడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ , ఏఐవైఎఫ్ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ , దళిత హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు చందమళ్ళ నవీన్ వున్నారు.

సాంకేతిక వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న అధునాతన సాంకేతిక వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఈ కేంద్రాలలో వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ఇంటర్మీడియట్ కొరకు అదనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడు తుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో గల రామ్ లక్ష్మణ్ రైస్ మిల్లును సందర్శించి రైస్ మిల్లుకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాల పురోగతిని పరిశీలించారు. రైస్ మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లుల నిర్వాహకుల సమన్వయంతో లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణ లక్ష్యాలు సాధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకర్లు నిర్దేశించిన రుణా లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా బ్యాంక్ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... మెదక్ అంటేనే వ్యవసాయ ఆధారిత జిల్లా, ఈ సంవత్సరం ఎక్కువగా వర్షాలు పడడం వల్ల ఖరీఫ్, రబి సీజన్లో సమృద్ధిగా పంటలు పండే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ మాసంకల్లా 80 శాతం రుణ లక్ష్యాలను సాధించాలన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, స్వయం సహాయక, ముద్ర, ఎమ్మెస్ఎంఈ, సూక్ష్మ, చిన్న, మీడియం ఎంటర్ప్రైజెస్ లకు నిర్దేశించిన రుణాలను ఆర్బిఐ నిబంధనల మేరకు, ప్రజా అవసరాల కొరకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్, డిఆర్డిఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన...

స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపుకు కేంద్రం ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ పరిశీలించారు. ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గురుకుల పాఠశాల /మెదక్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూంలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. వెంట జెడ్పీ సీఈవో ఎల్లయ్య, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు తదితరులున్నారు.

వాల్మీకి జీవితం..అందరికీ ఆదర్శం...

వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో....

జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్ర బోస్, శ్రీ రంగనాయక్, సీఐలు మధుసూదన్ గౌడ్, సందీప్ రెడ్డి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్ , ఏఓ మణి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : పోలీస్, రెవెన్యూ అధికారులకు ప్రజప్రతినిధులకు తెలియజేయునది ఏమనగా స్వర్ణ, కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి చేరువలోవున్నందున, పరివాహక(క్యాచ్మెంట్) ప్రాజెక్టులకు ఎగు,ప్రాంతాల్లో వర్షాలు పడుతున్న కారణంగా ప్రాజెక్టు వరద గేట్లు నుండి ఏక్షణం అయినా నీళ్లను వదిలే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతంలోకి (దిగువన) పశువుల గొర్రెల, జాలర్ల మొదలగువారు వెళ్లకుండా అలాగే పల్లెకారులు, గొర్రె కాపరులు రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండవలెనని ,స్వర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,కడెం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఒక ప్రకటనలో తెలిపారు.

డిఎస్పీ విష్ణుమూర్తి మృతదేహానికి ఎమ్మెల్యే కూనంనేని నివాళి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని జూలూరుపాడు మండల కేంద్రానికి చెందిన పోలీస్ శాఖ డిఎస్పీ సబ్బతి విష్ణుమూర్తి హైదరాబాద్‌లోని తన గృహంలో సోమవారం ఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. మంగళవారం వారం విష్ణుమూర్తి పార్థివ దేహాన్ని జూలూరుపాడులోని వారి స్వగృహానికి తీసుకోని వచ్చారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తోపాటు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. సాబీర్ పాషా ఆ గ్రామానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులార్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు విష్ణుమూర్తి విధినిర్వహణలో చూపే నిజాయితీ, ముక్కు సూటి తనాన్ని కొనియాడారు.

మహర్షి వాల్మీకి జయంతి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల/ రామకృష్ణాపూర్: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు సందర్భంగా మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి తొలుత దొంగగా జీవనం సాగించినప్పటికీ, తన గురువు బోధనల ద్వారా ప్రేరణ పొంది, పశ్చాత్తాపంతో సద్గుణ మార్గం వైపు మళ్లారు. ఆత్మశోధన ద్వారా మహానుభావుడిగా మారి, మనందరికీ ఆదర్శప్రాయమైన రామాయణం అనే గ్రంథాన్ని రచించారన్నారు. మన మనసు మారితే ఎవరైనా మహానుభావులుగా ఎదగగలరని తెలిపారు. ఆయన చూపిన సత్యం, ధర్మం, నీతి మార్గాల్లో నడుచుకుంటూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చి ..ఓట్లు అడగాలి

విశాలాంధ్ర తొర్రూరు : కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో 6 గ్యారంటీ హామీలు అమలు చేస్తేనే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలని బిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు, పసుమర్తి సీతారాములు మాజీ జెడ్పిటిసి జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు తొర్రూరు మండలం పోలపల్లి -ఫతేపురం ఎంపిటిసి క్లస్టర్, మాటేడు ఎంపిటిసి క్లస్టర్ మరియు అమ్మాపురం గ్రామాల ఎంపీటీసీ క్లస్టర్ గ్రామాలలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక బూటకపు హామీలు ఇచ్చి, ఆరు గ్యారెంటీ పేరుతో ఓట్లు దండుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకపోగా ప్రజలను, రైతులను ,కూలీలని, విద్యార్థులను, యువతను, నిరుద్యోగులను మోసం చేస్తూ తప్పుడు విధానాలతో ముందుకు పోతుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాన్ని గమనించి కాంగ్రెస్ కి పార్టీ కి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్ , పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, ఫ్యాక్స్ జనార్దన్ రాజు, తమ్మెర వీరభద్రరావు, మాజీ కో ఆప్షన్ ఎస్కే అంకుష్, కాలు, నాయక్, ఎంపిటిసి పరిధి ఇన్చార్జిలు కర్నే నాగరాజు, కడెం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వారోత్సవాలు

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత ,బాధ్యత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యాపేట లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు, పబ్లిక్ అథారిటీలపై ఉందని కలెక్టర్ అన్నారు. ఆయా పబ్లిక్ అథారిటీలు వారి దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులు కోరితే ఇవ్వాలని, ఏ పద్ధతిలో సమాచారం కోరితే ఆ పద్ధతిలో ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, ఎట్టి పరిస్థితులలో తప్పు సమాచారం ఇవ్వద్దని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారం యంత్రాంగాలలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ కె. సీతారామారావు , డిఆర్డిఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, డి.ఎఫ్.ఓ. సతీష్, జిల్లా,మండల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, యూనియన్ నాయకులు ఉన్నతాధికారులు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు వాల్మీకి జయంతి లేదా పర్గత్ దివస్ అని పిలువబడే వాల్మీకి జయంతి అన్నారు.ఈ రోజు మహర్షి వాల్మీకిని సంస్కృత సాహిత్యంలో ఆదికవి (మొదటి కవి) రామాయణ రచయితగా గౌరవిస్తూ ఆయనను స్మరించుకుంటుందని అన్నారు. రత్నాకర్ అనే దొంగ నుండి వాల్మీకి గొప్ప ఋషిగా మారడాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని వారు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, ఏ.ఐ.టి.యు.సి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సి.ఎం.ఓ.ఏ.ఐ అధ్యక్షులు రమేష్, ఇన్చార్జి పర్సనల్ మేనేజర్ ఎం.డి ఆసిఫ్, సీనియర్ పి.ఓ సత్యనారాయణ, జి.ఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపాదకీయం

గవాయ్ క్షమాగుణంతో సరిపోదు

సోమవారం సుప్రీంకోర్టులో 71 ఏళ్ల ఒక న్యాయవాది చేసిన పని విభ్రాంతి కలిగిస్తోంది. రాకేశ్ కిశోర్ అనే ఈ న్యాయవాది తన బూటు తీసి చేతిలో పట్టుకుని ఆవేశంగా అరుస్తూ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ వైపు దూసుకెళ్లారు. ఆ బూటు ఆయన వేపు విసిరారు. అయితే అది గవాయ్‌కి తగలలేదు. గురి తప్పి ఉండొచ్చు. అయినంత మాత్రాన న్యాయవాదినని చెప్పుకునే ఆ వ్యక్తి చేసిన పని అత్యంత దారుణమైంది. బూటు విసిరినందుకు ప్రధాన న్యాయమూర్తి చలించినట్టు కనిపించ లేదు. పైగా ఆయన చాలా హుందాగా వ్యవహరించారు. విద్వేషం నిండిన న్యాయవాది మీద కేసు కూడా పెట్టొద్దని గవాయ్ కోరారు. ఏమైతేనేం రాకేశ్ కిశోర్‌కు తన బూటు దక్కింది. అక్కడ ఉన్న పోలీసులు వెంటనే బూటు విసిరిన న్యాయవాదిని బయటకు ఈడ్చుకెళ్లారు. కొంత సేపు ప్రశ్నించి కూడా ఉండొచ్చు. కానీ గవాయ్ విశాల హృదయం కారణంగా రాకేశ్ కిశోర్ మీద కేసు ఏదీ ఉండకపోవచ్చు. ప్రధాన న్యాయమూర్తి ఏమీ జరగనట్టుగా యథావిధిగా కేసు విచారణ కొనసాగించారు. రాకేశ్ కిశోర్ ప్రధాన న్యాయమూర్తి మీద దాడి చేయడానికి మూడు కారణాలు ఒకటి ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ఖజరహో లోని ఒక దేవాలయంలో విష్ణుమూర్తి విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠించాలని ఆదేశించాలని ఇటీవల సుప్రీంకోర్టులో విచారణకు వచ్చినప్పుడు గవాయ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. "మీ విష్ణు మూర్తి సర్వశక్తి సంపన్నుడు కదా ఆయన విగ్రహాన్ని ఆయననే కాపాడుకొమ్మనండి. మీరు విష్ణుమూర్తి భక్తులు కనక తనను తాను కాపాడుకొమ్మని ప్రార్థనలు చేయండి అని గవాయ్ వ్యాఖ్యానించారు. ఆ ప్రజా ప్రయోజన వ్యాజ్యం ప్రచారానికి పరిమితమైందని, అందులో ప్రజా ప్రయోజనం ఏమీ లేదని కొట్టేశారు. ఆయన వ్యాఖ్యలలో వ్యంగ్యం ఉంటే ఉండొచ్చు కానీ ఆగ్రహం లేదు. ఆయన వ్యాఖ్యలు కచ్చితంగా శాస్త్రీయమైనవే. ఈ వ్యాఖ్యలు చాలా మందికి మింగుడు పడలేదు. అప్పటి నుంచి సామాజిక మాధ్యమాలలో గవాయ్‌పై తీవ్ర దుష్ప్రచారం, దూషణలు కొనసాగాయి. రాకేశ్ కిశోర్‌ను భద్రతా సిబ్బంది బయటకు లాకెళ్తున్నప్పుడు "సనాతన ధర్మాన్ని నిందించడాన్ని ఈ దేశం సహించదు" అని నినాదాలు చేయడమే కాదు ఆ మాటలు రాసిన ఓ చీటీ కూడా దొరికింది. రెండో కారణం ప్రధాన న్యాయమూర్తి గవాయ్ దళిత సమాజానికి చెందిన వారు ఒక దళితుడు ప్రధాన న్యాయమూర్తి పదవిలోకి రావడాన్ని అంగీకరించరు. 75 ఏళ్ల సుప్రీంకోర్టు చరిత్రలో దళితులు ప్రధాన న్యాయమూర్తి అయిన వారు ఇద్దరే. ఈ ఎదుగుదలను సహించని వారిలో ఆక్రోశం ఉంటుంది. ఇది వారి మనసులో ఓ అగ్నిపర్వతంలా కుతకుత ఉడుకుతూ ఉంటుంది. అది నిన్న సుప్రీంకోర్టులో బద్దలైంది. మూడో కారణం బౌద్ధ మతంలోకి మారిన గవాయ్ చేసిన వ్యాఖ్యలు వారికి అభ్యంతరకరంగా కనిపించాయి. ఆలోచనను కోల్పోయేలా చేశాయి. తార్కిక శక్తి లేకుండా పోయింది. హిందూ మత పరిరక్షణ భారాన్ని తలకెత్తుకున్న వారికి నిర్భయంగా ఇష్టా రాజ్యం కొనసాగిస్తున్నారు. మూక హత్యలకు ఇదే ప్రధాన కారణం. వీధిలో ఉన్న ముస్లింలను నీచమైన భాషలో దూషించగలరు. ఎన్నికైన ప్రజా ప్రతినిధిని నిండు సభలో నీచమైన మాటలతో అవమానించగలరు. కుదిరితే కొట్టి చంపగలరు. ముస్లింల మీద ఎంత విద్వేషం గూడు కట్టుకోకపోతే ఓ భద్రతా అధికారి రైలులో ముగ్గురు ముస్లింలను కాల్చి పడేయగలిగారు. హిందుత్వవాదులు ఏదో ఓ కారణం చేత ముస్లింలపై విద్వేషాన్ని పెంచి పోషిస్తున్నారు. మతం పేర జనానికి విచక్షణా శక్తి లేకుండా చేస్తున్నారు. వారి దృష్టిలో అదే సంస్కృతీ పరిరక్షణ.

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను నిర్వర్తించవలసిన ప్రధాన న్యాయమూర్తి మీద బూటు విసిరితే ప్రధానమంత్రి, న్యాయశాఖా మంత్రి, మోదీ మంత్రివర్గంలో జనం గుర్తు పట్టగలిగే నలుగురైదుగురు మంత్రులు తమ విద్వేష భావాన్ని మౌనం కింద దాచేయగలరు. ప్రధాని మోదీ, న్యాయశాఖా మంత్రి అర్జున్ రాం మేఘ్వాలు మొక్కుబడిగా ట్విట్టర్‌లో ఆశ్చర్యం వ్యక్తం చేసి హీన స్వరంతో ఖండించి ఏమీ ఎరగనట్టు ఉండగలరు. వారి మౌనం వెనక అంతరాంతరాళాల్లో రాకేశ్ కిశోర్ చేసిన పనికి ఆనందం కలగడమే. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ వర్గాల మీద అత్యాచారాలు నిరోధించడానికి ఓ ప్రత్యేక చట్టమే ఉంది. గవాయ్ మీద ఈ దాడి జరగినప్పుడు మోదీ ప్రభుత్వానికి ఆ మాట ఎందుకు గుర్తు రాలేదో. ప్రధాన న్యాయమూర్తి కుటుంబాన్ని అవమానించడానికి సంఘ్ పరివార్ పనిగట్టుకుని ప్రయత్నం చేస్తున్నట్టుంది. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవానికి ప్రధాన న్యాయమూర్తి తల్లి కమలతాయిని ఆహ్వానించడంలో కూడా ఓ కుట్ర ఉండొచ్చు. ఆమె నిర్ద్వంద్వంగా తిరస్కరించడంతో సరిపోయింది. ఆమె హాజరై ఉంటే ప్రధాన న్యాయమూర్తి మీద మతతత్వవాదిగా ముద్ర పడేది. చెప్పుతో కొట్టడం నిమ్న కులాల వారిని అవమానించడానికి సాధారణంగా వాడే పద్ధతి. రాకేశ్ కిశోర్ చేసిన దుర్మార్గాన్ని శూరత్వంగా భావించే వారూ ఉండొచ్చు. ఇలాంటి వారికి అందరినీ సమానంగా చూడాలని చెప్పే రాజ్యాంగంలోని 14 వ అధికరణం గుర్తుకే రాదు. గౌరవం కింది కులాల వారికి కూడా ఉండడాన్ని అంగీకరించరు. ఈ దాడి కేవలం గవాయ్ మీదే జరగలేదు. మనం అమలు చేస్తున్నామనే చట్టబద్ధ పాలన మీద, భారత రాజ్యాంగం మీదా జరిగింది. శతాబ్దాల పాటు కొనసాగిన అణచివేతను కొనసాగించే ప్రయత్నం మోదీ పాలనలో మూడు పూవులు ఆరు కాయలుగా వికసిస్తూనే ఉంది. కుల రాజకీయాలు సాగిపోతూనే ఉన్నాయి. ప్రధాన న్యాయమూర్తి గవాయ్ దయాగుణం చాటున ప్రభుత్వం చర్య తీసుకోక పోవడం అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి మీద దాడి జరిగినప్పుడు, ఆ వ్యక్తి సాక్షాత్తు ప్రధాన న్యాయమూర్తి అయినప్పుడు, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యుడైనప్పుడు చట్ట ప్రకారం చర్య తీసుకోక పోవడం ప్రత్యక్షంగా హిందుత్వ ఉన్మాదాన్ని ప్రేరేపించడమే. బార్ కౌన్సిల్ రాకేశ్ కిశోర్‌ను సస్పెండ్ చేయడంతో సరిపోదు. కపిల్ సిబ్బల్, ఇందిరా జైస్వాల్ లాంటి వారు గొంతెత్తితే సరిపోదు. దేశవ్యాప్తంగా న్యాయవాదులు తీవ్ర నిరసన వ్యక్తం చేయాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రధాన న్యాయమూర్తికి అండగా నిలవాలి. విద్వేష రాజకీయాలను ఎదుర్కోవడానికి అందరూ సమైక్యంగా పోరాడాలి. దీనికి గవాయ్ క్షమాగుణం ఆటంకం కలిగించకూడదు. రాకేశ్ కిశోర్ మీద చట్టప్రకారం చర్య తీసుకుంటేనే చట్టబద్ధ పాలన గురించి గొప్పలు చెప్పుకోవాలి. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువల్ని కాపాడే బాధ్యతను మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలకు వదిలేసినట్టుంది.

వ్యవసాయంపై మరింత దృష్టి అవసరం

పతకమూరి దామోదర్‌ప్రసాద్

స్వదేశీ వినియోగాన్ని, గిరాకీని పెంచి స్వయం సమృద్ధ భారత్‌ను నిర్మించాలని మన ఏలికలు నిర్దేశించుకోవడం సముచితమే. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మన ఎగుమతులపై 50 శాతం, మందులు, ఔషధాలపై నూరు శాతం దిగుమతి సుంకాలు విధించడమేగాక మన సినిమాలపై కూడా ఆంక్షలు విధించి భారత్‌ను ఆర్థికంగా దెబ్బ తీయడానికి కక్షపూరితంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దేశ ప్రయోజనాల పరిరక్షణకు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరమే. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి78 ఏళ్లు కావస్తున్నా వంట నూనెలు, పప్పు దినుసులు వంటి నిత్యావసరా లను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటూనే ఉన్నాం. 2024-25లో 17.3 బిలియన్‌ల విలువైన 164 లక్షల టన్నుల వంటనూనెలు, మన దేశీయ అవసరాలలో 57 శాతం దిగుమతి చేసుకున్నారు. దేశీయ పప్పుల వినియోగంలో 16.2 శాతం దిగుమతులే. దేశ రక్షణ పరికరాలలో నాలుగో వంతు దిగుమతులే. భారత్‌లో తయారీ ఇంకా ఊపందుకోలేదు. చైనా కంటే వెనుకబడి ఉన్నాం. స్వయం సమృద్ధ భారత్ లక్ష్యాలను సాధించాలంటే వివిధ రంగాలలో ముఖ్యంగా దేశ సరిహద్దులను కాపాడటం, 146 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రతను సమకూర్చడం ఎంతో ముఖ్యం. దేశ భద్రతకు అవసరమైన ఆత్యాధునిక ఆయుధాలు, క్షిపణి విధ్వంసక వ్యవస్థలు, యుద్ధ విమానాలు, డ్రోన్‌లు, అత్యధిక ఎత్తులో ఎగిరే హెలికాప్టర్ల కోసం భారత్ ఇప్పటికీ రష్యా, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలపై ఆధారపడక తప్పడంలేదు.

ఇక పెరుగుతున్న భారత జనాభాకు ఆహార స్వయం సమృద్ధిని సాధించాలంటే సేద్యపురంగాన్ని ఆధునికీకరించి, ఉత్పత్తి ఉత్పాదకతను పెంచాలి. మొక్కల ఎదుగుదలకు అవసరమైన సేంద్రీయ, వివిధ రసాయనిక ఎరువులను ఆదనులో అన్నదాతలకు అందుబాటులో ఉంచాలి. ఇటీవల తెలుగు రాష్ట్రాలలో యూరియా దొరకక రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఎరువుల సరఫరాను పెంచే చర్యలలో భాగంగానే టాటా కెమికల్స్ ఇటీవల మొరాకో సహకారంతో అ దేశంలోని బెర్రెచిడ్లో సంయుక్తంగా నిర్మించిన ఫాస్ఫేట్ ఎరువుల కర్మాగారాన్ని మొరాకో రక్షణ మంత్రి అబ్దుల్ లతీఫ్‌తో కలిసి ప్రారంభించడం శుభ సూచకం. మొరాకోలో ఎరువుల ఉత్పత్తికి అవసరమైన ముడివనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రపంచ ఫాస్ఫేట్ నిల్వలలో 70శాతం మొరాకోలోనే లభిస్తాయి. ప్రస్తుతం146 కోట్ల జనాభాతో భారత్ చైనాను వెనకకు నెట్టి ప్రపంచంలో మొదటి స్థానానికి చేరింది. 2050 నాటికి దేశ జనాభా 166 కోట్లకు చేరగలదని అంచనా. ఈ భారీ జనాభాకు ఆహార భద్రత చేకూరాలంటే తగిన ఆహారోత్పత్తికి నిరంతరాయంగా ఎరువులు సరఫరా చేయడం అవసరం. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేయాలని ఉత్పత్తి, తయారీ రంగాల అభివృద్ధి ద్వారా ఆర్థిక వ్యవస్థను మెరుగు పరిచేందుకు ట్రంప్ రానున్న కాలంలో ఏవో కుంటి సాకులతో భారత్ సహా వివిధ దేశాలపై సుంకాలు పెంచడం, వాణిజ్య ఆంక్షలు కొనసాగించవచ్చు. ఇప్పటికే భారీ సుంకాల వల్ల రొయ్యలు, చేపలు సముద్ర ఉత్పత్తులు, వస్త్రాలు రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు తదితర పరిశ్రమలలో లేఆఫ్‌ల వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోయి దిక్కుతోచక తల్లడిల్లుతున్నారు. అందుకే దేశీయ వినియోగాన్నీ, గిరాకీని పెంపొందించుకుంటూనే ప్రత్యామ్నాయ మార్కెట్‌లను కనుగొనాలి. ప్రధాని మోదీ స్వదేశీ వస్తువులనే కొనాలని అందుకే వస్తుసేవల పన్నును 2 స్లాబులకు కుదించామని, పండగ చేస్కోవాలని చెబుతున్నారు. నత్రజని ఎరువులు ముఖ్యంగా యూరియా ఉత్పత్తి అధికాధికంగా దిగుమతి చేసుకున్న సహజవాయువుపై ఆధారపడి ఉంది. సహజవాయువును సరఫరా చేస్తే మరికొందరు పారిశ్రామికవేత్తలు ఎరువుల తయారీకి ముందుకు వస్తారు. భారత్ ఫాస్ఫేట్ రాళ్లను, ఆమ్లాన్ని దిగుమతి చేసుకుని కొంత మేరకు ఫాస్ఫేట్ ఎరువులను ఉత్పత్తి చేస్తోంది. మొరాకోలో ఫాస్ఫేట్ గనులు అధికంగా ఉన్నందున ఆ దేశంతో సన్నిహితంగా వుండి సంయుక్తంగా, ఉభయ తారకంగా ఎరువుల ఉత్పత్తి జరిగేలా చూడాలి. మన దేశంలో అవసరమైన మోతాదు కంటే ఎక్కువగా యూరియా వాడటం వల్ల నేలలపైనే గాక ప్రజారోగ్యంపై కూడా దుష్ప్రభావాలు పడుతున్నట్లు శాస్త్రజ్ఞులు ఏలికలు హెచ్చరిస్తున్నారు. డీఏపీలో 18 శాతం నత్రజని అవసరం లేదంటున్నారు. యూరియా వాడకాన్ని తగ్గించే రైతులకు ఎకరాకు రూ 800 ప్రోత్సాహక మిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. టాటా అడ్వాన్స్ సిస్టం వలే మరిన్ని కంపెనీలు ఎరువుల ఉత్పత్తికి మొరాకో లేదా ముడి వనరులు అధికంగా లభించే దేశాల సహకారంతో ఉత్పత్తి ప్రారంభిస్తే అనేక దేశాలకు ఎరువులు అందుబాటులోకి వస్తాయి. భారత్ అతి పెద్ద మార్కెట్‌గా ఉండనే ఉంది. మన ఎరువుల కంపెనీలను, పారిశ్రామికవేత్తలను ఎరువుల ఉత్పత్తికి ప్రోత్సహించాలి. సౌదీ అరేబియా నుంచి ఏటా 30 లక్షల టన్నుల ఫాస్ఫేట్ ఎరువుల సరఫరాకు సంబంధించిన ఒప్పందంపై కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా ఇటీవల సంతకాలు చేశారు. పాకిస్థాన్‌తో సౌదీ రక్షణ ఒప్పందం దృష్ట్యా మన దేశం అప్రమత్తంగా ఉండాలి. భారత్ ఆహార భద్రత గురించి యోచించేటప్పుడు ప్రపంచ రాజకీయ పరిణామాలను, వాటి పర్యవసానాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రధాని మోదీ, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సేద్యపురంగ సమస్యలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదిస్తూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే కృషి చేయాలి. మన దేశంలో 2014 లో 385 లక్షల టన్నులుగా ఉన్న ఎరువుల ఉత్పత్తి 2023-24 నాటికి 503 లక్షల టన్నులకు పెరిగింది. ఈ కాలంలో యూరియా ఉత్పత్తి గరిష్టంగా 314 లక్షల టన్నులకు పెరిగింది. డీఏపీ, ఎస్ఎస్‌పీ ఎరువుల ఉత్పత్తి తగ్గింది. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరిగి, తేమ నిల్వ పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు విస్తరణ సేవలు పెంచి, ఎరువులు విత్తనాల వాడకంపై తగిన సలహాలు ఇస్తే మన అన్నదాతలు అధికోత్పత్తులు సాధించగలరు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రైతు కుటుంబాలకు చెందిన వారే గనుక సేద్యపు రంగ సర్వతోముఖాభివృద్ధికి మరింత శ్రద్ధతో కృషిచేయగలరని ఆశిద్దాం.

సీనియర్ జర్నలిస్టు, 9440990381

శతాబ్దిగా వినాశకరమైన మత హింస

రామ్‌పునియాని

భారతదేశ రాజకీయాలలో అత్యంత వినాశకరమైన మతహింస శతాబ్ది కాలంగా జరుగుతూ మానవాళిని తీవ్రమైన కష్టనష్టాలకు గురిచేస్తూ పెచ్చరిల్లుతూనే ఉంది. ప్రణాళికాబద్ధంగానే హింసాకర మతహింస జరుగుతున్నదని ధృవీకరించవచ్చు. అత్యధిక మేధావులు హింసా ధోరణిని ధృవీకరిస్తున్నారు. మత సమీకరణల ద్వారా దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిణామాలను నిరంతరం మేధావులు పరిశీలిస్తూనే ఉన్నారు. జాతి, మతం ఆధారిత పార్టీలు ప్రయోజనం పొందుతుండగా కాంగ్రెస్ అన్ని విధాలుగా ప్రత్యేకించి అత్యధికంగా నష్టపోతోంది. ప్రధానంగా హిందువులు, ముస్లింల మధ్య దాడులు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువగా నష్టపోవడానికి కారణమవుతోంది. జాతి, మత ఆధారిత పార్టీలు ఒకదానిపై ఒకటి దాడులు మరింతగా బలపడుతున్నాయి. ఏదో ఒక సాకుతో హింసను ప్రేరేపించటం వాస్తవం. దీని ఫలితం ఏమంటే మత పార్టీలకు ఎన్నికల ప్రయోజనాలు కలుగుతున్నాయి. కొత్త కొత్త నెపాలను మోపుతూ హింసను పెంచుతున్నారు. నెపాలకు సంబంధించి దీర్ఘ జాబితానే ఉంది. మసీదుల ఎదుట పెద్ద పెద్ద శబ్దాలతో సంగీతాన్ని మోగిస్తూ ఆలయాల్లో బీఫ్‌ని (గొడ్డు మాంసం) విసిరివేస్తున్నారు. ఈ చర్యను ఎదుటి పక్షంపై మోపుతూ వారిపైన ద్వేషాన్ని విస్తరిస్తున్నారు. ముస్లింలు ఆలయాలను ధ్వంసం చేస్తూ ఇస్లాం మతస్థులే కత్తులతో హింసను విస్తరిస్తున్నారని వీరంతా దెయ్యాలుగా మారుతున్నారని, ముస్లింల కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నారని హిందువులు మైనారిటీలుగా మారిపోతున్నారని చెపుతూ ద్వేషాన్ని సృష్టించే గ్రూపులు తయారవుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా గో హింసకు పాల్పడుతున్నారని, బీఫ్‌ను తింటున్నారని అలాగే లవ్ జిహాద్, ఇంకా అనేక జిహాద్‌లను ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కరోనా జిహాద్, భూమి జిహాద్, తాజాగా పేపర్ లీక్ జిహాద్‌ను ప్రచారం చేస్తూ వీటన్నింటికి ముస్లింలే కారణమని విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు.

ప్రస్తుతం "ఐ లవ్ మహ్మద్" ప్రమాదంలేని నినాదాన్ని సృష్టించి దేశ వ్యాప్తంగా హింసకు పాల్పడుతున్నారు. ముందుగా కాన్పూరులో మిలాద్-ఉన్-నబి సందర్భంగా

ప్రాఫెట్ మహ్మద్ జయంతిని పురస్కరించుకుని ప్రదర్శన జరిపారు. అయితే కొంతమంది ఐ లవ్ మహ్మద్ బ్యానర్‌ను పట్టుకోవడాన్ని అభ్యంతరం తెలియజేశారు. మతపరమైన పండగ సందర్భంగా నూతన సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారని ఆరోపిస్తున్నారు. అయితే ఒక విభాగం పోలీసులు ఈ వివాదాన్ని అంగీకరిస్తున్నారు. మొదట ఇలాంటి పోస్టర్‌లను ప్రదర్శించటాన్ని తిరస్కరిస్తూ పోలీసులు బ్యానర్‌లను పట్టుకొన్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాఫెట్ జయంతి సందర్భంగా ప్రదర్శన జరపడం పూర్తిగా నియమాలను ఉల్లంఘించటమేనని ఆరోపిస్తున్నారు. మొదట కాన్పూరులో జరిగిన హింసాకాండ ఉత్తరప్రదేశ్‌లో అనేక జిల్లాలకు విస్తరించింది. మొట్టమొదటగా ఈ ఘటన కాన్పూరులో జరిగింది. అనంతరం బరేలీ, బారాబంకి, మావ్ జిల్లాలలోను జరిగింది. అలాగే ఉద్దంసింగ్ నగర్ జిల్లా (ఉత్తరాఖండ్) కాశీపూర్‌లో ఇంకా అనేక ప్రదేశాలలో హింసాయుత సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనలు ముందుగా పోస్టర్‌ను చించివేయటంతో ప్రారంభమై ఆ తర్వాత హింస చోటు చేసుకుని అక్కడి వాతావరణం విషతుల్యమైంది. ఇంతవరకు పౌర హక్కుల రక్షణ అసోసియేషన్ (ఏపీసీఆర్) తయారుచేసిన డాక్యుమెంట్ల ప్రకారం ఐ లవ్ మహ్మద్ అని నినదించిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 21 ఎఫ్ఐఆర్‌ల మూలంగా 1324 మందిపై ప్రభావితం జరిగింది. 38 మందిని అరెస్టు చేశారు. బరేలీలో కొద్ది రోజుల పాటు ఇంటర్నెట్‌ను సస్పెండ్ చేశారు. స్థానిక నాయకుడు మౌలానా తౌకీర్ రజాఖాన్‌ను వారం రోజుల పాటు గృహ నిర్బంధం చేశారు. పైగా ముస్లింలను వివక్షాపూరితంగా హింసించినట్టు నిందించారు. వాస్తవంగా ఆయన కల్లోలాన్ని సృష్టించలేదు. అయినప్పటికీ ఎంతమాత్రం బాధ్యత లేకుండా పోలీసులు అనేక మంది ముస్లింలను అరెస్టు చేశారు. ముస్లింలకు వ్యతిరేకంగా ద్వేషించడానికి ఇంటర్నెట్‌ను నిలిపివేశారని ఆరోపించారు. సరిగ్గా ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ పదేపదే ఇలాంటి ఘటనలు జరగడానికి కారణమని ఆరోపణలకు గురవుతున్నారు. అలాగే ఇతర దేశాల ప్రజలు ఆయా రాష్ట్రాలలోకి చొరబడుతున్నారని మోదీ ఎన్నికల ప్రచారంలో ఆరోపిస్తున్నారు. ఆయా రాష్ట్రాల వెలుపల అనేక కిలోమీటర్ల పరిధిలో కేంద్ర ప్రభుత్వానికి చొరబాటుదార్లు ఎవరూ రాకుండా కాపలాకాసే బాధ్యత ఉంటుంది.

ఎన్నికల సందర్భంగా బీహార్, అసోం రాష్ట్రాలలో ముస్లింలంతా చొరబాటుదార్లని ఆరోపిస్తూ వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. దాదాపు 47 లక్షల మందికి పైగా మొదట ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఇలాంటి సంఘటనలు ఉత్తరప్రదేశ్‌లో గరిష్ట స్థాయిలో చోటు చేసుకున్నాయి. యూపీ ముఖ్యమంత్రి యోగీఆదిత్యనాథ్ ఏ ముఖ్యమంత్రికి తగని ప్రకటనలు జారీ చేశారు. గజ్వా-ఎ-హింద్ నినాదాన్ని ఇస్తున్న వారికి నరకానికి వెళ్లడానికి టిక్కెట్లు ఇస్తాం. గజ్వా నినాదాన్ని తాలిబన్ల తరహా వారు వినియోగిస్తున్నారు. అయితే హిందూ మితవాదులు ఈ నినాదాన్ని ఇస్తున్నారని మొత్తం ముస్లింలను ద్వేషిస్తున్నారు. ఖురాన్‌లో గజ్వా-ఎ-హింద్ నినాదం ఎక్కడా కనిపించదని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ చెబుతున్నారు. పాకిస్థాన్‌కు చెందిన అనేక మంది నాయకులు ఇండియాకు వ్యతిరేకంగా జరిగే ప్రతి యుద్ధంలోను గజ్వాను సమర్థిస్తున్నారు. అరాచకాన్ని సృష్టించడం కోసమే ఐ లవ్ మహ్మద్ పోస్టర్లను ప్రదర్శించారని యోగీ ఆరోపించారు. హిందు వ్యతిరేక, జాతి వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా హిందువులు అప్రమత్తంగా ఉండాలని యోగీ కోరారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ముంబయి ఎడిషన్‌లో సెప్టెంబరు 29 న ఆరో పేజీలో ఈ అంశాలను ప్రచురించారు.) ఈ నినాదం అరాచకాన్ని ఏవిధంగా సృష్టిస్తుందో చెప్పాలి. భారతదేశంలో ఎక్కువ మంది మైనారిటీలకు చెడు భావాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నినాదం అరాచకాన్ని ఎలా సృష్టిస్తుంది? అలాగే ఈ నినాదం దేశ వ్యతిరేకమైనది ఎంత మాత్రం కాదు. ఐ లవ్ మహ్మద్ సంఘటనతో ముస్లింలను భయపెట్టేందుకు, వారిని హింసించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. పాకిస్థాన్ మీద క్రికెట్ క్రీడలో భారతదేశం విజయం పొందిన తర్వాత ఆపరేషన్ సిందూర్‌కు పొడిగింపు అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో ముస్లింలు ఎలా స్పందించగలరు? శ్రీరామనవమి సందర్భంగా జరిగే ప్రదర్శన సందర్భంగా డీజేఎస్ భారీ శబ్దాన్ని చేసే సంగీతాన్ని సంఘ్ పరివార్ పతాకాన్ని ప్రదర్శిస్తూ మసీదుల మీదుగా వెళతున్నారు. అంతేకాదు కొంతమంది హిందూ పండగలకు ఆయుధాలను కూడా ధరిస్తున్నారు. ముస్లింల పండగలకు తీవ్రమైన ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు, రాజ్యాంగ నైతికతను పూర్తిగా ఉల్లంఘిస్తు ప్రకటనలు జారీ చేయటం ఎంత మాత్రం సరైంది కాదు.

అతిశీతల ప్రమాదం!

వినియోగదారులకు ఓ హెచ్చరిక! వినిమయ హక్కుల కోసం పోరాడే వినియోగదారులు కొన్ని బాధ్యతలను గుర్తుపెట్టుకోవాలి. ఇంట్లో వాడే రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు పర్యావరణానికి ఎంత ప్రమాదకరమో ఇటీవల విడుదలైన ఓ నివేదిక వెల్లడించింది. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా వచ్చిన ఈ నివేదిక వినియోగదారులకు తెలియాల్సిన అవసరం ఉంది. మిలియన్ల కొద్దీ ఎయిర్ కండిషనర్లలో ఉపయోగించే రిఫ్రిజిరేటర్లు పర్యావరణానికి ఎంత ప్రమాదకరమో తేలింది. హైడ్రోఫ్లోరోకార్బన్లు సీఓ2 (కార్బన్‌డైయాక్సైడ్) కంటే భూమిని మరింత వేడి చేస్తాయని చెపుతున్నారు. పర్యావరణాన్ని కొంతలో కొంత పరిరక్షించే ఓజోన్ పొర విశ్వంలో పెరిగిన కాలుష్యం కారణంగా రంధ్రాలతో ఛిద్రమవుతున్నది. సూర్యుడి నుంచి వెలువడే ప్రాణాంతక అతినీలలోహిత కిరణాల నుంచి మనల్ని రక్షించే పొర ఓజోన్. ఇది క్లోరోఫ్లోరోకార్బన్లు (సీఎఫ్‌సీలు), హైడ్రోక్లోరోఫ్లోరోకార్బన్లు (హెచ్‌సీఎఫ్‌సీలు) వంటి రసాయనాల వల్ల తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లుగా విస్తృతంగా వినిమయంలోకి వచ్చాయి. రిఫ్రిజిరేషన్ కోసం వీటిలో వాడే సాధనాలు సీఎఫ్‌సీ, హెచ్‌సీఎఫ్‌సీలను విచ్చలవిడిగా బయటకు వదులుతున్నాయి. మాంట్రియల్ ప్రోటోకాల్ ప్రకారం, ఈ రసాయనాలను 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా నిలువరించాలి. అలాచేస్తేనే, 2066 నాటికి ఓజోన్ పొర పూర్తిగా కోలుకుంటుందని, చర్మ క్యాన్సర్ నుంచి కోట్లాది మంది ప్రాణాలను కాపాడవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కాకపోతే, ఒక సంక్షోభం తగ్గుతున్న కొద్దీ మరొకటి వేగంగా విస్తరిస్తోంది. ఈసారి కొత్త రిఫ్రిజిరేటర్లు, ఏసీల మూలంగా ఈ సీఎఫ్‌సీలు, హెచ్‌సీఎఫ్‌సీల బెడద పెరిగింది. శీతలీకరణ కోసం వాడే హైడ్రోఫ్లోరోకార్బన్‌లు (హెచ్‌సీఎఫ్‌సీలు) వాతావరణాన్ని వేడి చేయడంలో కార్బన్ డయాక్సైడ్ (సీఓ2) కంటే వందల రెట్లు ఎక్కువ శక్తిమంతమైనవి. ముఖ్యంగా భారతదేశంలో, చల్లదనం కోసం గదిలో వాడే ఎయిర్ కండీషనర్ల (ఆర్ఏసీలు) నుంచి ఈ లీకేజీ విపరీతంగా జరుగుతోందని రుజువైంది.

కరోనా తర్వాత అంటే 2020 నుంచి ఆర్ఏసీల అమ్మకం ఏటా 15 నుంచి 20% వరకు పెరిగింది. పట్టణీకరణ, పెరుగుతున్న ఆదాయాలు, తీవ్రతరం అవుతున్న వేడి గాల్పులు వంటి పరిణామాలు మధ్యతరగతి వర్గాన్ని ఏసీలు లగ్జరీ స్థాయి నుంచి గృహ అవసరంగా మార్చివేశాయి. భారతదేశంలో ప్రస్తుతం దాదాపు 70 మిలియన్ ఆర్ఏసీలు (రూమ్ ఏసీలు) ఉన్నాయి. మొదట్లో 10% స్వల్ప వార్షిక అమ్మకాల వృద్ధి ఉన్నప్పటికీ, ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2035 నాటికి 245 మిలియన్లకు అంటే మూడు రెట్లకు పైగా పెరుగుతుందని అంచనా. కానీ మనం మన ఏసీలను ఎంత బాధ్యతాయుతంగా ఉపయోగిస్తున్నాం? వాటి శక్తి సామర్థ్యం గురించి మనం ఎంత అవగాహనతో ఉన్నాం? మనం ఎంత తరచుగా రిఫ్రిజిరేటర్లను రీఫిల్ చేస్తున్నాం? వాటి హానికరమైన ప్రభావాల గురించి మనకు ఎంత తెలుసు? సమాధానాలను కనుగొనడానికి, ఐఫారెస్ట్‌లో ప్రముఖ పర్యావరణవేత్త చంద్రభూషణ్, ఆయన సహోద్యోగులు ఇటీవల ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, పూణే, జైపూర్ వంటి ఏడు ప్రధాన నగరాల్లోని అన్ని ఆదాయ వర్గాలకు చెందిన 3,100 కంటే ఎక్కువ కుటుంబాల నుంచి మొట్టమొదటి జాతీయ గృహ సర్వేను నిర్వహించారు. ఫలితాలు ఆకర్షణీయంగా ఉన్నట్లు అన్పించినా తీవ్ర ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ సర్వేలోని వాస్తవికత కొన్ని దీర్ఘకాల అపోహలను ఛేదించింది. దాదాపు 87% మందికి ఒకే ఏసీ ఉందని, 13% మందికి మాత్రమే రెండు కంటే ఎక్కువ ఏసీలు ఉన్నాయని సర్వే చెప్పింది. ఏసీలు ఇకపై సంపన్నులకే పరిమితం కాదని ఇది చూపిస్తుంది. అంటే అత్యధికస్థాయి ఎయిర్ కండీషనర్లు ఇప్పుడు మధ్య, దిగువ స్థాయి ఆదాయ కుటుంబాలలో ఉన్నాయి. దాదాపు 98% గృహాల్లో 3-స్టార్ నుంచి 5-స్టార్ రేటెడ్ ఉపకరణాలను

వాడుతున్నారు. ఇందులో 3-స్టార్ కేటగిరీ ఆధిపత్యం చెలాయిస్తోంది. నగరాల్లో అత్యధికులు తమ ఏసీని 22-26 డిగ్రీల సెల్సియస్ మేరకు థర్మోస్టాట్ సెట్టింగ్‌లతో ఏసీలను వాడుతున్నారు. భారతదేశంలో, రిఫ్రిజిరెంట్ లీకేజ్, రీఫిల్లింగ్‌ల నిష్పత్తి సంక్షోభస్థాయికి చేరుకుంది. ఐదు సంవత్సరాల కంటే పైబడిన పాత ఏసీలలో దాదాపు 80% ఏటా రీఫిల్ చేయవలసి ఉంటుంది. కాకపోతే, ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న కొత్త ఏసీలలో మూడింట ఒక వంతు కూడా ప్రతి సంవత్సరం రీఫిల్ చేయాల్సి వస్తోంది. ఫలితంగా, భారతదేశంలోని అన్ని ఏసీలలో దాదాపు 40% ఏటా రీఫిల్ అవుతున్నట్లు సగటున చెప్పవచ్చు. నిజానికి ఏసీలకు ఐదు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే రీఫిల్ అవసరం. భారత్‌లో ఇది ప్రతి రెండు నుంచి మూడు సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్నది. ఈ అనవసరమైన రీఫిల్లింగ్‌కు అధిక ఖర్చు అవుతుంది. 2024లోనే, భారతదేశంలోని ఏసీలు 32 మిలియన్ కిలోల రిఫ్రిజెరాంట్‌ను వినియోగించాయి. సగటున ఒక్కో రీఫిల్‌కు రూ.2,200 ఖర్చుతో, గృహాలు దాదాపు రూ.7,000 కోట్లు (0.8 బిలియన్లు) ఖర్చు చేశాయి. వ్యాపారం యథావిధిగా కొనసాగితే, 2035 నాటికి రీఫిల్లింగ్ బిల్లు నాలుగు రెట్లు పెరిగి దాదాపు రూ.27,500 కోట్లకు (3.1 బిలియన్లు) చేరుకుంటుంది.

ఈ వాడకం వల్ల భారత్‌లో పర్యావరణం ఎక్కువగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. మన దేశంలో విస్తృతంగా ఉపయోగించే రిఫ్రిజెరాంట్ అయిన హెచ్‌ఎఫ్‌సీ-32, వేడిని బంధించడంలో సీఓ2 కంటే 675 రెట్లు ఎక్కువ శక్తిమంతమైనది. ఉదాహరణకు, 2024లో, ఏసీల నుంచి విడుదలయ్యే రిఫ్రిజెరాంట్ లీకేజ్ 52 మిలియన్ టన్నుల (ఎమ్‌టీ) సీఓ2కి సమానం. 2035 నాటికి, ఇది 84 ఎమ్‌టీకి పెరుగుతుంది. 2024లో భారతదేశ ఏసీల మొత్తం విడుదల చేసిన జీహెచ్‌జీ అనే ప్రమాదకరమైన ఉద్గారాలు 156 ఎమ్‌టీకి చేరుకున్నాయి. అంటే దేశంలోని అన్ని ప్రయాణీకుల కార్ల నుంచి వచ్చే ఉద్గారాలకు ఇది సమానం. సరళంగా చెప్పాలంటే, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రీఫిల్ చేసిన ఏసీ నుంచి వార్షిక జీహెచ్‌జీ ఉద్గారాలు కారుతో సమానం. 2035 నాటికి, ఏసీల నుంచి వచ్చే మొత్తం ఉద్గారాలు రెట్టింపు అయి 329 ఎమ్‌టీకి చేరుకుంటాయని అంచనా. దేశంలో జీహెచ్‌జీ-ఉద్గార గృహోపకరణాలలో ఏసీలే అతిపెద్దవిగా మారనున్నాయని స్పష్టమవుతోంది.

ఇండియా కూలింగ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం, 2037-38 నాటికి రిఫ్రిజెరాంట్ డిమాండ్‌ను 25-30% తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ దానికి మద్దతు ఇచ్చే నిబంధనలు లేవు. అదేవిధంగా, సవరించిన ఇ-వేస్ట్ (నిర్వహణ) నియమాలు-2023 ప్రకారం పాతబడిన ఏసీలను పారవేయాలి. కానీ అది పేలవంగా అమలవుతోంది. ప్రస్తుతం సర్వీసింగ్ సమయంలో లీక్‌లను నివారించడానికి సమర్థవంతమైన వ్యవస్థలు లేవు, శీతలీకరణ రీఫిల్‌లను పర్యవేక్షించడం లేదు. ప్లాస్టిక్‌లు లేదా ఎలక్ట్రానిక్ వ్యర్థాల మాదిరిగా రిఫ్రిజెరాంట్‌లు ఎటువంటి అర్థవంతమైన ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (ఈపీఆర్) ఫ్రేమ్‌వర్క్ కిందకు రావు. పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ఏసీల నియంత్రణకు సమగ్ర లైఫ్ సైకిల్ రిఫ్రిజెరాంట్ మేనేజ్‌మెంట్ (ఎల్ఆర్ఎం) అవసరం. రిఫ్రిజెరాంట్‌ల రికవరీ, రీసైక్లింగ్, సురక్షితమైన విధ్వంసం బాధ్యతను తయారీదారులే తీసుకోవాలి. కానీ కార్పొరేట్లకు ఊడిగం చేసే ప్రభుత్వాలు ఈ తరహా నిబంధనలను రూపొందించడం లేదు. కెనడా, ఆస్ట్రేలియా, ఈయూ, చైనా, సింగపూర్‌తో సహా అనేక దేశాలు ఇటువంటి నిబంధనలను అమలు చేస్తున్నాయి. భారత్‌లోనూ వీటిని సమర్థవంతంగా అమలు చేస్తే, కార్బన్ ఉద్గారాలను నిరోధించవచ్చు. లేకుంటే పర్యావరణ విధ్వంసానికి ఏసీ వినియోగదారులే సింహభాగం పాపాన్ని అనుభవించాల్సి ఉంటుంది.

సీజేఐపై దాడి పిరికిచర్య: సోరెన్

రాంచీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ఘటనను పిరికిపంద చర్యగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అభివర్ణించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్య ఆత్మపై దాడిగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ గౌరవం, స్వాతంత్ర్యం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా మూలస్థంభం. దానిపై చేయి ఎత్తడం అంటే దేశ రాజ్యాంగంపై చేయి ఎత్తడంతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు: మోదీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 2001లో సరిగ్గా ఇదేరోజు నాటి చిత్రాలను షేర్ చేశారు. ఆ రోజు ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. '2001 ఇదే రోజున గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశాను. నా తోటి భారతీయులు నిరంతరం అందిస్తోన్న మద్దతుకు కృతజ్ఞత తెలియజేస్తున్నాను. ప్రభుత్వాధినేతగా 25వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాను. ఈ ప్రయాణంలో ప్రజల జీవితాలు మెరుగుపర్చడం కోసం, దేశ పురోగతికి నావంతు ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నాను' అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన నాటి చిత్రాలను షేర్ చేశారు. మోదీ 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తన గుజరాత్ మోడల్‌తో 2014 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి... ఎన్డీయేను విజయతీరాలకు చేర్చారు. వరుసగా మూడుసార్లు ప్రధాని పదవి చేపట్టారు.

దగ్గు మందు మరణాలపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో దగ్గు మందు మరణాలపై దర్యాప్తు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలైంది. జ్యుడిషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీతో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని పిటిషన్ పేర్కొంది. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఎఫ్ఐఆర్‌లను సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. పారిశ్రామిక ద్రావకాలలో వినియోగించే విషపూరిత రసాయనం డైథిలిన్ గ్లైకాల్ కలిగిన కలుషితమైన దగ్గు సిరప్‌ల తయారీ, నియంత్రణ, పరీక్ష, పంపిణీపై సమగ్ర విచారణ చేపట్టాలని, మెడిసిన్ తయారీకి సూచనలు జారీ చేయాలని కోరింది. ప్రస్తుతం నిషేధం విధించబడిన కోల్డ్రిఫ్ సిరప్ స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాలని, వాటి విక్రయాలు, పంపిణీ జరగకుండా అడ్డుకోవాలని సుప్రీంకోర్టును కోరింది. సిరప్‌లు విషపూరితం కాలేదని నిర్ధారించేందుకు ఎన్ఏబీఎల్ ప్రయోగశాలకు పంపాలని పిటిషన్ కోరింది. మధ్యప్రదేశ్‌లో దగ్గు సిరప్ కోల్డ్రిఫ్‌తో 14 మంది చిన్నారులు మరణించిన సంగతి తెలిసిందే. కోల్డ్రిఫ్ సిఫారసు చేసిన ప్రభుత్వ వైద్యుడు, తమిళనాడుకు చెందిన తయారీదారుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేయడానికి మధ్యప్రదేశ్ పోలీసులు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేశారు.

కేజ్రీవాల్‌కు ప్రభుత్వ బంగ్లా

న్యూఢిల్లీ: ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళాలో ఆయన ఉండనున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. అయితే... ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. గుర్తింపుపొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రీవాల్‌కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళా కేటాయించింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన 35, లోధి ఎస్టేట్‌లోని బంగళా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆప్ కోరింది. కానీ, దాన్ని జులైలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీకి కేటాయించింది. కేజ్రీవాల్‌కు ఇప్పుడు కొత్తగా కేటాయించిన ఇంట్లో గతంలో బీజేపీ నేత, జాతీయ మైనారిటీ కమిషన్ మాజీ చైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు. నూతన నివాసాన్ని కేజ్రీవాల్ దంపతులు ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. పక్కనే ఉన్న 97వ భవనంలో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఉంటున్నారు.

జుబీన్ గర్గ్ భద్రతా సిబ్బంది ఖాతాల్లో రూ.కోటి

గువహతి: అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గర్గ్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ... ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. గాయకుడి భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి లావాదేవీలు జరిగాయి. గర్గ్ మృతిపై సిట్ దర్యాప్తు కొనసాగుతుంది. ఆయనకు చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గర్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. గాయకుడి మృతి కేసును ఆర్థిక కోణంలో కూడా దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. ఇటీవల జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్‌జ్యోతి గోస్వామి తన వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడికి ఆయన మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ విషమిచ్చి దాన్ని ప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారన్నారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏమాత్రం కంగారు పడలేదన్నారు. వెంటనే వైద్యచికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం, రాజ్యాంగం ఖూనీ

- రాయ్‌బరేలీలో దళితుడి హత్య కిరాతకం
- సమాజంపై చెరగని మరక: ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ: మూక ఉన్మాదానికి ప్రస్తుత కాలం భయానక గుర్తుగా మిగులుతుందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. న్యాయాన్ని అణచివేయడం, మూక హత్యలకు పాల్పడటం మామూలైపోయిందని ఆందోళన వ్యక్తంచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలీలో 38ఏళ్ల దళితుడు హరీం వాల్మికి హత్య కిరాతకమని, సమాజంపై చెరగని మరకని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇది రాజ్యాంగాన్ని, మానవత్వాన్ని ఖూనీ చేయడమేనన్నారు. అణగారిన వర్గాలపై హింస పెరుగుతుండటంపై ఆవేదన వ్యక్తంచేశారు. 'మానవులంతా సమానమని చెప్పే రాజ్యాంగం మన దేశానిది. ప్రతి పౌరుడి భద్రత, హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛకు హామీనిచ్చే చట్టాలు మనకున్నాయి. అయితే రాజ్యాంగానికి, దళిత సమాజానికి విరుద్ధమైన ఘటన రాయ్‌బరేలీలో జరిగింది. ఇది అత్యంత హేయం. దేశ ఆత్మను కళంకితం చేసింది' అని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. దళితులు, మైనారిటీలు, పేదలపై నేరాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. వెనుకబడిన వర్గాలపై హింస నిత్యకృత్యంగా మారిందంటూ హత్రాస్, ఉన్నావో ఘటనలు, రోహిత్ వేముల ఆత్మహత్య, ఒడిశా-మధ్యప్రదేశ్‌లో దళితులపై భౌతిక దాడులు, హర్యానాలో పెహ్లూ ఖాన్, ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్ మూక హత్యలను గుర్తుచేశారు. శాంతి భద్రతల సంస్థాగత వైఫల్యానికి ఈ ఘటనలు ఆధారాలన్నారు. 'ప్రస్తుతం దళితులు, గిరిజనులు, ముస్లింలు, వెనుకబడిన వర్గాలు, పేదల ఇలా బలహీనమైన ప్రతి ఒక్కరి గొంతు అణచివేయబడుతోంది. వారిపై దాడులు జరుగుతున్నాయి. వారి భాగస్వామ్యాన్ని హరిస్తున్నారు. వారి జీవితాలకు విలువ లేదన్నట్లు హింస, ద్వేషం, మూక దాడులతో రెచ్చిపోతున్నారు. రాజ్యాంగాన్ని బుల్డోజర్‌తో భర్తీ చేస్తున్నారు. న్యాయం స్థానంలో భయం కనిపిస్తోంది' అని రాహుల్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. తాజాగా జరిగినది ఒక వ్యక్తి హత్య కాదని... మానవత్వం, రాజ్యాంగం, న్యాయం హత్యకు గురయ్యాయని ఆయనన్నారు. హరీం వాల్మికి కుటుంబానికి తప్పక న్యాయం జరుగుతుందని అభయమిచ్చారు. భారత భవిష్యత్తు సమానత్వం, మానవత్వంపై ఆధారపడి ఉందని వక్కాణించారు. దేశంలో రాజ్యాంగం ఆధారిత పరిపాలన సాగుతోంది తప్ప మూక పాలన కాదని రాహుల్ అన్నారు. 2014 నుంచి మూక హత్యలు, దాడులు, 'బుల్డోజర్' అన్యాయం, మూక పాలన పేట్రేగిపోయాయని, ఇవి మన కాలానికి భయానక గుర్తులుగా మారాయని ఖర్గే, రాహుల్ వ్యాఖ్యానించారు. హింస ఎప్పుడు సభ్య సమాజానికి చిహ్నం కాబోదన్నారు. హరీం వాల్మికి ఘటన నైతికపరంగా అనేక ప్రశ్నలకు తావిస్తోందని అన్నారు. అంబేద్కర్ కలలు కన్న దేశం... మహాత్మా గాంధీ 'వైష్ణవ్ జన్' విజన్ ఇది కాదని, అందులో సామాజిక న్యాయం, సమానత్వం, దయ-కరుణ ఉన్నాయని, ఇటువంటి నేరాలకు స్థానం లేదని చెప్పారు. మానవత్వమే భవిష్యత్తుకు హామీ ఇవ్వగలదని రాహుల్, ఖర్గే నొక్కిచెప్పారు. అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతుల సాధికారతకు తమ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. అన్యాయాన్ని ఐక్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడి హక్కులు, గౌరవ మర్యాదలకు సంపూర్ణ భద్రత లభించేంత వరకు ఈ పోరాటం జరగాలన్నారు. ఇదిలావుంటే, డ్రోన్లను దొంగలించినట్లు పుకార్లు రావడంతో తన అత్తారింటికి వెళుతుండగా హరీం వాల్మికిపై గ్రామస్తులు మూక దాడి చేసి అతనిని చంపేశారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేశారు. కాగా, బాధితుడి సోదరుడితో రాహుల్ ఫోన్‌లో మాట్లాడారని, వారి కుటుంబానికి భరోసానిచ్చారని కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు అజయ్ రాయ్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

బీహార్‌లో కొత్త పొత్తులు?

- ఎన్డీఏ నుంచి ఎల్‌జేపీ వైదొలిగే అవకాశం
- చిరాగ్, పీకే జట్టు కడతారని ప్రచారం

పట్నా: బీహార్‌లో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో కొత్త పొత్తులపై జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఎన్డీఏ, ఇండియా ఐక్యసంఘటన మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తుండగా... కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ), ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ (జేఎస్పీ) కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ, జేడీయూతో సీట్ల పంపిణీలో లెక్క తేలడం లేదు. బీహార్‌లోని మొత్తం 243 స్థానాల్లో ఎన్డీఏ కూటమిలోని ప్రధాన పార్టీలైన బీజేపీ, జేడీయూ తలో 100 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నాయి. మిగతా 43 స్థానాలను ఎల్‌జేపీ సహా చిన్నచిన్న పార్టీలకు ఇవ్వాలని యోచిస్తున్నాయి. అందులో 25 స్థానాలు ఎల్‌జేపీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. కానీ ఎల్‌జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్ మాత్రం తన పార్టీకి 40 అసెంబ్లీ స్థానాలు కావాలని అడుగుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 5 స్థానాలు కేటాయిస్తే ఐదింట గెలిచామని, ఇప్పుడు 40 స్థానాలు కేటాయించాల్సిందేనని పట్టుబడుతున్నారు.

ఒకవేళ 40 స్థానాలు ఇవ్వకపోతే కూటమి నుంచి బయటికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చారు. ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపిణీపై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడతానని, జేడీయూతో సంబంధం లేదని అన్నారు. అంటే నితీశ్ కుమార్ అంటే తనకు గిట్టదని ఆయన మరోసారి చెప్పకనే చెప్పారు.ఇక బీజేపీ కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే... ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే అవకాశం తనకు ఉందని కూడా అన్నారు. ప్రశాంత్ కిషోర్‌తో కలిసి కూటమి ఏర్పాటు చేస్తే... సగానికిపైగా స్థానాల్లో పోటీచేయవచ్చని, ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉంటాయని చిరాగ్ ఆలోచన అని, అది అతని ప్లాన్ బీ అని ఎల్‌జేపీ వర్గాలు చెబుతున్నాయి.

తొక్కిసలాట పిటిషన్‌పై 10న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: కరూర్ తొక్కిసలాటపై సీబీఐ దర్యాప్తును నిరాకరిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అక్టోబర్ 10న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం తెలిపింది.

శుక్రవారం జాబితా చేయమని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ నేత ఉమా ఆనందన్ పిటిషన్ దాఖలు చేశారు. కరూర్ జిల్లా వేలుసామిపురంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ బహిరంగ ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది మరణించారు. వారిలో చాలా మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రత్యేక పిటిషన్‌ను ప్రధాన ధర్మాసనం తోసిపుచ్చింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (నార్త్‌జోన్) అస్రాగార్గ్‌ను సిట్‌కు నేతృత్వం వహించాలని పేర్కొంది. కోర్టుకు కాలానుగుణ నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

అన్నాడీఎంకేతో విజయ్ దోస్తీ?

పొత్తుపై రహస్య చర్చలు

చెన్నై: కరూర్ తొక్కిసలాట ఘటనతో ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అధికార డీఎంకేను ఒంటరిగా అడ్డుకోవడానికి ప్రతిపక్ష అన్నాడీఎంకేతో చేతులు కలిపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆ పార్టీ అధినేత విజయ్ ఆదేశాల మేరకు కీలక నేతలు అన్నాడీఎంకేతో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. తమిళనాడులో రెండేళ్ల క్రితం పార్టీని ప్రారంభించిన సినీ నటుడు విజయ్... వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వారానికి రెండురోజులు జిల్లా కేంద్రాల్లో బస్సు ప్రచారం చేపడుతున్నారు. అధికార డీఎంకేపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల కరూర్ ప్రచారం సందర్భంగా తొక్కిసలాట జరిగి... 41 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసుల అరెస్టుకు భయపడి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సహా ప్రముఖులంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోవటంతో ఆ పార్టీ గందరగోళంలో పడిపోయింది. కరూర్ దుర్ఘటనపై డీఎంకే తీవ్రంగా స్పందించకపోయినా ఆ ఘటనకు బాధ్యులు ఆ పార్టీయేనన్నట్లుగా విజయ్ వేలెత్తి చూపుతున్నారు. ఈ ఘటనపై నిరాధార పరస్పర ఆరోపణలకు దిగవద్దని, సంయమం పాటించాలంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ప్రకటనను సైతం విజయ్ పట్టించుకోలేదు. అయితే ప్రభుత్వ యంత్రాంగం మాత్రం టీవీకేదే తప్పు అన్నట్లుగా చర్యలకు దిగింది. ఇదే సమయంలో బీజేపీ, అన్నాడీఎంకేలు విజయ్ పార్టీని సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నాయి. అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అయితే ఈ దుర్ఘటనతో విజయ్‌కి ఎలాంటి సంబంధం లేదన్న ధోరణితో ప్రకటనలు గుప్పిస్తున్నారు. అంతేకాకుండా విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయవద్దంటూ రెండు పార్టీల నేతలకు ఆదేశాలు కూడా వెళ్లినట్లు తెలిసింది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఆ పార్టీ సీనియర్ నేత హెచ్.రాజా విజయ్‌కి మద్దతుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. కరూర్ దుర్ఘటనకు రోడ్‌షోలో తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టని డీఎంకే ప్రభుత్వమే ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకోవాలా? వద్దా? అని టీవీకే అధినేత విజయ్ మల్లగుల్లాలు పడుతుండగానే పార్టీ శ్రేణులు ఆయన అనుమతి తీసుకోకుండా మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్)ని స్వాగతిస్తున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు అంటిస్తున్నారు. ఇకపై ఎడప్పాడి పాల్గొనే సభలు ఎక్కడ జరిగినా విజయ్, ఈపీఎస్ ఫొటోలతో స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేస్తామంటూ సినీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఈ పరిస్థితులలో విజయ్‌ని ఎన్డీయేలో చేర్చుకోవాలని అన్నాడీఎంకే నేతలు, బీజేపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. విజయ్ కూడా ఎన్డీయేకి, తనకు రాజకీయ ప్రత్యర్థి డీఎంకే కనుక ఉమ్మడి శత్రువైన స్టాలిన్ ఢీకొనడానికి మెగా కూటమిలో చేరటమే మంచిదని భావిస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు టీవీకే ముఖ్య నేతలు అన్నాడీఎంకే నాయకులతో చర్చిస్తున్నట్లు తెలిసింది.

చెరువులో 500 ఓటరు కార్డులు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఓ చెరువులో వందలాది ఓటరు కార్డులు పడి ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఛతర్‌పూర్ జిల్లా బిజావర్‌లోని చెరువులో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు అక్కడికి వచ్చారు. చెరువులో సుమారు 500 ఓటరు కార్డులు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా రాజకీయ దుమారం రేపింది. ఓటరు కార్డులు చెరువులో ఉండటంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు . దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు దీప్తిపాండే విజ్ఞప్తి చేశారు. కార్డులు భద్రపరిచామని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు. ఇది నిర్లక్ష్యం కారణంగా జరిగిందా, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసిందా అనే దానిపై విచారిస్తామన్నారు.

ఎస్ఐఆర్ నిర్వహణలో ఈసీ విఫలం: కాంగ్రెస్



న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహణలో ఎన్నికల సంఘం (ఈసీ) పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేశ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో సంపూర్ణత, సమానత్వం, కచ్చితత్వం లోపించిందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఈసీ వ్యవహారశైలి న్యాయబద్ధతలోని లోపాలను బహిర్గతం చేసిందని విమర్శించిన ఒక వార్తా కథనాన్ని జైరామ్ తన వ్యాఖ్యకు జోడించారు. బీహార్ ఓటర్ల జాబితా నుండి ఎంత మంది దేశ పౌరులు కాని వ్యక్తులను తొలగించారో వెల్లడించే ధైర్యం ఎన్నికల సంఘానికి లేదని జైరామ్ అన్నారు. ఎస్ఐఆర్‌పై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జైరామ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పీఎఫ్ ఖాతాదారులకు పెన్షన్ పెరిగేనా?

న్యూఢిల్లీ: ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) పెన్షనర్లకు శుభవార్త అందించనుంది. 11 సంవత్సరాలుగా మార్పు లేకుండా ఉన్న కనీస నెలవారీ పెన్షన్ పెంచేందుకు సంస్థ చర్చలు జరుపుతోంది. అక్టోబర్ 10-11 తేదీలలో బెంగళూరులో జరగనున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలో పెన్షన్ పెంపుతోపాటు సేవలను డిజిటలీకరణ చేసే ఈపీఎఫ్ఓ 3.0 విధానం, పరిపాలనా సంస్కరణలు కూడా చర్చలో ఉంటాయి. ప్రస్తుతం ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ కింద కనీస నెలవారీ పెన్షన్ రూ.1,000గా ఉంది. 2014 నుంచి ఈ మొత్తంలో ఎటువంటి సవరణ జరగలేదు. జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెన్షనర్ల జీవనాన్ని మరింత కష్టతరం చేస్తోంది. ఈ కారణంగా ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు కనీస పెన్షన్‌ను రూ.7,500కి పెంచాలని కోరుతున్నాయి. నివేదికల ప్రకారం ఈపీఎఫ్ఓ రూ.2,500 వరకు పెన్షన్ పెంచాలని చూస్తున్నట్లు తెలిసింది. ఈ పెంపు బోర్డు సభ్యుల ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం కూడా తుది ఆమోదం తెలిపాలి. పెన్షన్ పెంచడం వల్ల ఈపీఎస్-95 స్కీమ్‌లోని దాదాపు 70 లక్షల మందికి ఊరట లభించనుంది. ఈ స్కీమ్ కింద ఉద్యోగులు తమ జీతంలో కొంత భాగాన్ని ఈపీఎఫ్ఓకు చెల్లిస్తారు. ఇది రిటైర్మెంట్ తర్వాత వారికి పెన్షన్‌గా అందుతుంది.

అసోం, గుజరాత్‌కు రూ.707 కోట్ల వరద సాయం

న్యూఢిల్లీ: 2024లో వరదలు, కొండచరియలు విరిగిపడిన అసోం, గుజరాత్‌కు అదనపు కేంద్ర సహాయానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ రూ.707.97 కోట్లు ఆమోదించింది. రాష్ట్ర అగ్నిమాపక సేవల విస్తరణ, ఆధునీకరణ కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు రూ.903.67 కోట్లు ఇవ్వడానికి కమిటీ ఆమోదం తెలిపింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) లో అందుబాటులో ఉన్న సంవత్సరానికి ప్రారంభ బ్యాలెన్స్‌లో 50 శాతం సర్దుబాటుకు లోబడి ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి సహాయం అందజేసినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. మొత్తం రూ.707.97 కోట్లలో అసోంకు రూ.313.69 కోట్లు, గుజరాత్‌కు రూ.394.28 కోట్లుకు ఆమోదించింది. హర్యానా, మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌కు ఇచ్చిన మొత్తం రూ.903.67 కోట్లలో రూ.676.33 కోట్లు కేంద్ర సహాయంగా ఉంటాయి. హర్యానాకు రూ.117.19 కోట్లు, మధ్య ప్రదేశ్‌కు రూ.397.54 కోట్లు, రాజస్థాన్‌కు రూ.388.94 కోట్లను కమిటీ ఆమోదించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో రాష్ట్రాలతో భుజం భుజం కలిపి నిలుస్తుందని, అవసరమైన అన్ని సహాయాన్ని అందిస్తుందని ప్రకటన పేర్కొంది. ఈ అదనపు సహాయం కేంద్రం ఇప్పటికే రాష్ట్రాల వద్ద ఉంచిన ఎస్‌డీఆర్ఎఫ్ నుంచి రాష్ట్రాలకు విడుదల చేసిన నిధుల కంటే ఎక్కువగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, కేంద్రం ఎస్‌డీఆర్ఎఫ్ కింద 27 రాష్ట్రాలకు రూ.13,603.20 కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద 12 రాష్ట్రాలకు రూ.2,024.04 కోట్లు విడుదల చేసింది. అదనంగా రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) నుంచి 21 రాష్ట్రాలకు రూ.4,571.3 కోట్లు, జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి తొమ్మిది రాష్ట్రాలకు రూ.372.09 కోట్లను విడుదల చేసింది.

'డీబీటీ' ద్వారా రూ.4.31 లక్షల కోట్లు ఆదా

ఆర్థిక మంత్రి

ముంబై: వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్ధిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడం వల్ల ప్రభుత్వానికి రూ.4.31 లక్షల కోట్ల వ్యయం ఆదా అయిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ సంగతి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి మంగళవారం విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్-టైమ్(తక్షణమే) ప్రాతిపదికన పూర్తి చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా తగ్గుతుందని అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి చెప్పారు. దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడికి ప్రయోజనం కలిగేలా టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు.

ఎస్పీ, కాంగ్రెస్‌ది కపటత్వం: మాయావతి

లక్నో: సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్‌ను బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు మాయావతి మంగళవారం తీవ్రంగా విమర్శించారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వారసత్వాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తూనే... ఆయన పట్ల 'అత్యంత కులతత్వ, మోసపూరిత' విధానాన్ని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌లో, ఎస్పీ, కాంగ్రెస్ రెండూ కాన్షీరామ్ పట్ల 'లోతైన కుల పక్షపాతం, శత్రుత్వం' ప్రదర్శించాయని ఆమె ఎక్స్‌లో విమర్శించారు. కాన్షీరామ్ బీఆర్ అంబేద్కర్ ఆత్మగౌరవ ఉద్యమాన్ని పునరుద్ధరించారని, దోపిడీకి గురైన దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాలను పాలక వర్గాలుగా మార్చడానికి కృషి చేశారని ఆమె అన్నారు. అక్టోబరు 9న కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహించాలని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ... మాయావతి దీనిని 'శుద్ధ వంచన' అని పిలిచారు. అది అతని 'ద్వంద్వ ముఖాల విధానాన్ని' ప్రతిబింబిస్తోందన్నారు. కాన్షీరామ్‌కు ఆ పార్టీ ద్రోహం చేసిందని, ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నించిందని ఆమె ఆరోపించారు. 2008 లో బీఎస్పీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాన్షీరామ్ నగర్ జిల్లా పేరును 'కుల వివక్ష, రాజకీయ దురుద్దేశం' కారణంగా ఎస్పీ ప్రభుత్వం కాస్‌గంజ్‌గా మార్చిందని మాయావతి గుర్తు చేసుకున్నారు. బీఎస్పీ పాలనలో కాన్షీరామ్ పేరు మీద ఉన్న అనేక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులను తరువాత ఎస్పీ ప్రభుత్వం పేరు మార్చిందని, దీని వలన వారి 'దళిత వ్యతిరేక మనస్తత్వం' బయటపడిందని ఆమె పేర్కొన్నారు. కాన్షీరామ్ మరణించిన తర్వాత ఒక్క రోజు కూడా అధికారిక సంతాప దినం ప్రకటించలేదని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా అక్టోబరు 8న లక్నోలో భారీ ర్యాలీ నిర్వహించాలని బీఎస్పీ ప్రణాళిక చేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

దోబీ ఘాట్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : దోబి ఘాట్ సమస్యలు పరిష్కారానికి స్థానిక పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ని శామీర్ పేట్‌లోని ఆయన నివాసంలో కలిసి స్థానిక నాగోల్ దోబిఘాట్‌లో పెండింగ్ ఉన్న కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్, ధోబి కానాలు, బాత్రూంలు, హైమాస్ లైట్, డ్రింకింగ్ వాటర్ కనెక్షన్ తదితర సమస్యలపై మెమోరండం అందజేశారు. దీనిపైన స్పందించి సంబంధిత అధికారులకు లేక ఇస్తూ వెంటనే, ఆ సంపూర్తిగా వున్న మౌలికవసతుల పనులు పూర్తిచేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగోల్ రజక సంఘం నాయకులు బి.చుక్కయ్య, బి.కృష్ణ, బి.మధు, బి.మహేందర్ వున్నారు.

జస్టిస్ గవాయిపై దాడికి నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత రాజ్యాంగాన్ని కాపాడే ప్రతి పౌరుడి మనసును కలచివేస్తున్న పరిణామం ఇది. సుప్రీమ్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) ఆధ్వర్యంలో హిమాత్ నగర్ వై జంక్షన్ లో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు కే.ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తీవ్రంగా ఖండించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కే.ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు విసిరి దాడికి పాల్పడినాడని ఇది ఆర్ఎస్ఎస్ పథకం ప్రకారం చేసిన దాడి అని దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్. తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తుంది. ఈ దాడులు కేవలం జస్టిస్ గవాయ్‌పైన మాత్రమే కాదు భారతదేశపు రాజ్యాంగం, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపైన నేరుగా దాడులు చేస్తున్నవే. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపర్చే ఈ ధోరణి, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు తీవ్రమైన ప్రమాదం. జస్టిస్ గవాయ్ ఎల్లప్పుడూ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా తీర్పులు ఇచ్చారు. ఆయనపై జరుగుతున్న ఈ దుష్ప్రచారం, దళిత సమాజ ప్రతినిధులను భయపెట్టే ప్రయత్నం, న్యాయ వ్యవస్థను రాజకీయ ఒత్తిళ్లకు లోను చేయించే కుట్రగా మేము భావిస్తున్నాము తక్షణమే సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్ కిషోర్‌పై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డి హెచ్ పి ఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ దాడికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. దేశ ప్రజల మెదడులో విద్వేషాలను నింపుతున్న ఆర్ఎస్ఎస్ విష సంస్కృతి వల్లే ఈ భౌతిక దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ నాయకులు బాబు, రాజు , మనమ్మ, లక్ష్మి రాజమ్మ, లలిత ,కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా దుండిగల్ మున్సిపల్ కార్యాలయం నందు కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆయన పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మయ్య, రెవెన్యూ ఆఫీసర్ నగేష్ బాబు,వార్డ్ ఆఫీసర్స్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: రోడ్డు భద్రత అందరి బాధ్యత టీపీసీసీ మీడియా , కమ్యూనికేషన్స్ చైర్మన్, అధికార ప్రతినిధి శ్రీ సామ రామ్మోహన్ రెడ్డి అని అన్నారు. శ్రీ కృష్ణ యూత్ ప్రజల ప్రాణ భద్రత కోసం అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని శ్రీ కృష్ణ యూత్ వ్యవస్థాపకులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం మల్కం చెరువు వద్ద రోడ్డు భద్రతపై ప్రజా అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ సామ రామ్మోహన్‌రెడ్డి ,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ అభిషేక్ గౌడ్, రోహిత్ గౌడ్, ట్రాఫిక్ డీసీపీ మాధాపూర్, ఏసీపీ మాధాపూర్,గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు భరత్ గౌడ్ , డీసీసీ సెక్రటరీ సురేష్ గౌడ్, శశాంక్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణభద్రత కోసం హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు.ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలనీ, రోడ్డు భద్రత చర్యలు ప్రాణాలను కాపాడటమే కాకుండా సామాజిక క్రమశిక్షణకు ప్రతీక అని తెలిపారు.

బడ్జెట్ వచ్చినా... కార్మికులకు అందని జీతాలు

- పెండింగ్ జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్న ఏజెన్సీని రద్దు చేయాలి
- జడ్చర్ల ఏరియా ఆసుపత్రి 83 పడకల సామర్థ్యం నుంచి 50కు తగ్గింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య,సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న శ్రీ శాంతి ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. మూడు నెలల పెండింగ్ వేతనాల చెల్లించాలని, ఆసుపత్రి 83 పడకల నుండి 50 పడకలకు కుదింపు నిర్ణయం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో కాంట్రాక్టు పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపి అనంతరం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హరినాథ్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ కార్మికులు దసరా పండుగకు ఆసుపత్రి కార్మికుల పస్తులు ఉండారాదని ప్రభుత్వం నాలుగు నెలల వేతన బడ్జెట్ విడుదల చేసినప్పటికీ శ్రీ శాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, వైద్య అధికారుల అలసత్వం కారణంగా కార్మికులకు పెండింగ్ వేతనాలు అందక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఇప్పటికి జీతాల చెల్లింపుల విషయంలో స్పష్టత రావడంలేదని ఆరోపించారు. జడ్చర్ల ఏరియా 100 పడకల ఆసుపత్రిగా ప్రభుత్వం ప్రారంభించి కేవలం 83 పడకలకు మాత్రమే అనుమతులు ఇచ్చిందని తాజాగా ఎలాంటి ముందస్తు ప్రకటనలు చేయకుండా అసంబద్ధంగా 83 పడకల నుండి 50 పడగలకు ఆసుపత్రి సామర్థ్యం తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ నుండి 50 పడకల సామర్థ్యం తగ్గిస్తూ నాలుగు నెలల వేతన బడ్జెట్ విడుదల చేశారని దీనితో కార్మికులు ఆరు నెలల వేతనాలు కోల్పోవడమే కాకుండా ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేసిన కార్మికులు ఉద్యోగులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు స్పందించి ఆసుపత్రి పడకల సామర్థ్యం తగ్గకుండా చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ఆగడాలపై విచారణ జరిపి ఏజెంట్ లైసెన్సులు రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న కార్మికుల జీతాలు తక్షణమే అందించాలని లేనిచో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు నరసింహ, నవీన్, పేర్మల్, రామకృష్ణ, రవీందర్,శేఖర్, మన్నెమ్మ, పద్మ, భార్గవి, నీరజ, చెన్నమ్మ, నరసమ్మ,స్వాతి, అంజలి, మంగమ్మ, అలివేళ, విజయలక్ష్మి, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణలో ప్రభుత్వ నిర్ణయం సంతోషం : కోదండరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పరిశ్రమలు, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే భూసేకరణ విషయంలో రేవంత్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. భూములు ఇచ్చే రైతులకు.. బదులుగా ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే ఆలోచన బాగుందన్నారు. మంగళవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో రైతు కమిషన్ బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తోపాటు సభ్యులు కేవీఎస్ రెడ్డి, భవానీ రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఐటీ,ఇండస్ట్రీస్ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, టీజీఐఐసీ ఎండి శశాంక్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లాలో 2005 నుండి హార్డ్ వేర్ పార్క్, ఫ్యాబ్ సిటీ, ఫార్మా సిటీ ల కోసం ప్రభుత్వాలు చేపట్టిన భూసేకరణపై చర్చించారు. చిరకాలంగా పెండింగ్ లో వున్న భూ సేకరణ విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టిందన్నారు. ఐతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా బాధ్యతలు తీసుకున్న తర్వాత రైతుల అభీష్టం మేరకు ఫార్మా సిటీని రద్దు చేయడమే కాకుండా , రైతాంగానికి అన్యాయం జరగకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా భూ నష్టపరిహారంతో పాటు ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ప్రకటించడం పై రైతు కమిషన్..మంత్రి శ్రీధర్ బాబుకు, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసింది. రైతులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈ మూడు ప్రాజెక్టుల విషయంలో కొందరు రైతులకు ఇంకా నష్టపరిహారం అందలేదని, కొన్ని కేసులు కూడా ఉన్న విషయాలను కూడా ప్రస్తావనకు తెచ్చారు. వారందరికీ కూడా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కమిషన్ కోరింది.

బీసీ రిజర్వేషన్‌ల కేసులో హైకోర్టులో సీపీఐ ఇంప్లీడ్ పిటిషన్

విశాలాంధ్ర, హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన కేసులో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఇంప్లీడ్ పటిషన్ దాఖలు చేసింది. బీసీ రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో తమను ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ సీపీఐ తరుపున తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు వర్తించే జీవో 9ను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు పెంచడాన్ని సమర్థిస్తూ , దానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని, ఆ కేసులో తమను ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ సిపిఐ ఇంప్లీడ్ పిటిషన్ వేసింది. ఇప్పటికే విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు సహా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే బిల్లులను శాసనసభలో సిపిఐ సంపూర్ణంగా మద్దతు పలికింది.

డిఆర్సీ సెంటర్లో ఏర్పాట్లు చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : డిఆర్ సీ సెంటర్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోనీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో డిఆర్‌సి సెంటర్, స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులతో కలిసి పరిశీలించారు. డిఆర్‌సి సెంటర్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు ఉండాలన్నారు. పరిశీలనలో జిల్లా ఎన్నికల అధికారి వెంట అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, రిటర్నింగ్ అధికారి పి సాయిరాం, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

బీసీల రిజర్వేషన్‌లను కాపాడుకుంటాం: ఎర్ర

విశాలాంధ్ర, బషీర్ బాగ్: స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్‌లను కాపాడుకుంటామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బీసీల 42 శాతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌ల పరిరక్షణకై జీవో 9ని కాపాడుకోవడానికి సంబంధించిన పిటిషన్లలో తాను ఇంప్లీడ్ అవుతున్నట్లు తెలిపారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ నేత, న్యాయవాది జక్కుల వంశీ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎర్ర సత్యనారాయణ మాట్లాడారు. గవర్నర్ ప్రొసీజర్, మెరిట్‌పై వచ్చిన అంశంపై సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి కావాలని హైకోర్టు తీర్పు ప్రకారం జీవో ఇచ్చామనే ప్రభుత్వ వాదనను పూర్తిగా సమర్థిస్తామన్నారు. ఇదే అంశంలో సెప్టెంబర్‌లో పంపించిన బిల్లు తేదీని పరిగణలోకి తీసుకోవాలనే వాదన ద్వారా సాంకేతిక అంశాల సమస్యను అధిగమిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ అంశంలో రాజకీయ పార్టీలన్నీ అవలంబిస్తున్న ద్వంద వైఖరులను ఎండగడతామన్నారు. ఈ సమావేశంలో బీసీ ఐక్య కులాల వేదిక అధ్యక్షులు పాండు యాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నరహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో అరుణ్ కుమార్, పాండు యాదవ్, సురేందర్ యాదవ్, పి.నర్సింహులు ముదిరాజ్, బుగ్గోజి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం

- లంచాల మత్తులో అధికారులు
- యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- రాత్రికి రాత్రే కనుమరుగవుతున్న ప్రభుత్వ భూములు:కుతాడి ముఖేష్

విశాలాంధ్ర-జవహర్ నగర్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనేక ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయని మేడ్చల్ జిల్లా బాడీ బిల్డింగ్ ఫిట్నెస్ అధ్యక్షులు కుతాడి ముఖేష్ మీడియాతో పేర్కొన్నారు. ఆయా భూముల పరిరక్షణకు గతంలో నేను వార్డు మెంబర్ ఉన్నప్పటినుండి నేడు కోఆప్షన్ సభ్యులుగా కొనసాగినంతవరకు నేను ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేస్తున్నానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లాల్ బంగ్లా సమీపంలో ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 476 ప్రభుత్వ భూమికి ఎన్‌ఓసి లేదని అందులో అక్రమంగా తమన్నా గ్రీన్స్ అపార్ట్మెంట్ ఫామ్ హౌస్‌లు స్విమ్మింగ్ పూల్‌లు నిబంధన అతిక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. గతంలో పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ అక్రమంగా ప్రజాప్రతినిధుల కనుసన్నలో ఆగమేఘాలపై నిర్మాణం చేపట్టారని ఆ భూమికి గతంలో తహసీల్దార్ గౌతమ్ కుమార్ ఉన్నప్పుడు పలుమార్లు బోర్డు పెట్టారని దానిని తొలగించే ప్రయత్నం చేస్తే పలుమార్లు ముఖేష్ అడ్డుకున్నట్టుగా ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. నేటికీ తమన్నా గ్రీన్స్ అపార్ట్మెంట్‌కు పర్మిషన్ లేకున్నా, అధికారులు ప్రజా ప్రతినిధులు కనుసన్నల్లో ఈ బిల్డింగ్ నిర్మాణం జరిగిందని ఇప్పటివరకు పలు సర్వే నెంబర్లలో ఇక్కడ 13 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురి అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి 2025 వరకు 501 సర్వే నెంబర్లో గల ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాకు పాల్పడి జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా వందల కోట్ల రూపాయలు ప్రభుత్వ భూములను తెగ నమ్మి కోట్ల రూపాయలు సంపాదించి గోవా, కాశి, ఇండోనేషియా, శ్రీలంక, నేపాల్ పలు దేశాలలో జవహర్ నగర్ భూముల మీద వందల కోట్లు సంపాదించి విదేశాల్లో అక్రమంగా ఆస్తులు కొనుగోలు చేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వ భూములు కబ్జాలు చేసి బయటి దేశాలలో ఆస్తులు కొనుగోలు చేశాడని ధ్వజమెత్తారు.ఇప్పటికైనా దర్యాప్తు సంస్థలు దృష్టి సాధించి అతడిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని అక్రమ ఆస్తులు జప్తు చేయాలని ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో పెండింగ్‌లోవున్న పనులను పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆల్వాల్‌లోని ఐటిఐ కాలేజీలో నూతనంగా ప్రారంభించిన ఏటీసీ సెంటర్‌న్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటిసి సెంటర్‌లో పెండింగ్‌లో ఉన్న ఏసీ ఫిట్టింగ్ కంప్యూటర్ ఇన్స్టాలేషన్ వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సెంటర్లోని మిషనరీని తరగతి గదులను పరిశీలించారు. మొత్తం ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ఎన్ని ట్రేడ్లు ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క ట్రేడ్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని వారికి సరిపడా బోధన సిబ్బంది ఉన్నారా అని ఆరా తీశారు. టెక్నాలజీ కోర్సులలో ప్రాక్టికల్ థియరీ క్లాసులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బోధన సిబ్బంది సమాధానం యిస్తూ వర్క్‌షాప్ రూఫ్ లీకేజ్ అవుతుందని పారిశుధ్య సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ పర్యటనలో డివో శేఖర్‌రెడ్డి సూపరింటెండెంట్ శైలజ బోధన సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి కేసు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీటెక్ విద్యార్థిపై దాడి కేసులో ఐదుగురు నిందితులను అంబర్ పేట పోలీసులు అరెస్ట్ చేశారు. 24 గంటల్లో పోలీసులు ఈ కేసును చేదించి నిందితులను కటకటాల వెనక్కి పంపించారు. మంగళవారం సాయంత్రం అంబర్ పేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కాచిగూడ ఎసిపి హరీష్ కుమార్, ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ లు దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మేడిపల్లి కమలానగర్ కు చెందిన నరేష్ కుమారుడు అభినవ్ పై ఈనెల 5 అర్ధరాత్రి బాగ్ అంబర్ పేట్ అయ్యప్ప దేవాలయం వద్ద కొంతమంది విచక్షణారహితంగా కర్రలు, బీరు సీసాలతో దాడి చేశారు. ఈ దాడిలో అభినవ్ తీవ్రంగా గాయపడడంతో పోలీసులు ఆతడిని మలక్ పేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అభినవ్ తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అంబర్ పేట పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ దాడి కేసుకు సంబంధమున్న తురబ్‌నగర్‌కు చెందిన డి.గౌతమ్(18), డి.సంపత్(20), బాగ్ అంబర్ పేట్ బంగ్లా గల్లీకి చెందిన బి. యశ్వంత్ (21), బుర్జు గల్లీకి ఫ్యాషన్ డిజైనర్ ఏ.శివకుమార్ (26), ఫోటోగ్రాఫర్ బి భాస్కర్ (22)లను పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ హరీష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఈ దాడి కేసులో పోలీసులు సకాలంలో స్పందించి క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇదే విధంగా వరుసనేరాలకు పాల్పడితే నిందితులపై సస్పెక్ట్ షీట్, ఆ తర్వాత రౌడీషీట్ తెరుస్తామని ఏసిపి తెలిపారు. బాధితుడి తండ్రి నరేష్ మీడియాతో మాట్లాడుతూ దాడిలో గాయపడిన తన కుమారుడు అభినవ్‌ను అంబర్ పేట సీఐ కిరణ్ కుమార్, ఎస్సై సురేష్‌లు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిపారు. తన ఫిర్యాదు మేరకు వెంటనే దాడి చేసిన వారిని అరెస్టు చేశారని ఆయన వెల్లడించారు.

వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలిలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులు హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆపరేషన్స్-1 వినోద్ భార్గవ, సీజీఎంలు తదితరులు పాల్గొన్నారు. మహా ఋషి వాల్మీకి మహర్షి అని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి అదనపు కలెక్టర్ కదిరవన్ పలని తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి ఈ వెంకటాచారి, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శమైన రామాయణం రచించిన వాల్మీకి సత్యం, ధర్మం, న్యాయం, సేవా వంటి విలువలను సమాజానికి చాటి చెప్పారని అన్నారు. సంస్కృత సాహిత్యంలో అయన సేవను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, లా ఆఫీసర్ శ్రీధర్, ఈ డి ఎస్సీ కార్పొరేషన్ డాక్టర్ రమేష్, ఏవో విజయలక్ష్మి, ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర - తుర్కయంజల్: మున్సిపల్ కార్యాలయం లో వాల్మీకి జయంతి కార్యక్రమము సందర్భంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం : జ్ఞానేశ్వర్

విశాలాంధ్ర , కాప్రా : దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై సనాతన ధర్మం ముసుగులో జరిగిన మనువాద దాడిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని బీఎస్పీ పార్టీ మేడ్చల్ జిల్లా ఇంచార్జ్.రాగిరి జ్ఞానేశ్వర్ అన్నారు. ఈ దాడి దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజు. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత,లౌకిక ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే పార్టీ భావిస్తుంది. ఈ దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ,ఆధిపత్య కులాల నుండి అవమానాలు మాత్రం తప్పడం లేదు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జస్టిస్ బి.ఆర్.గవాయిపై జరిగిన దాడి అని ఆయన మండిపడ్డారు. ఈ దేశంలో వేల ఏళ్లుగా అవమానాలకు గురవుతున్న జాతులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారం దక్కాలి. రాజ్యాధికారం దక్కనంతకాలం మన జాతులకు అవమానాలు, అణిచివేతలు, దాడులు తప్పవు. ఈ దేశంలో రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఎంతటి ఉన్నత స్థాయి పదవులు అనుభవించిన సరే,వాళ్ళకు ఆత్మగౌరవం, రక్షణ రెండూ ఉండవని అన్నారు.జస్టిస్ బి.ఆర్.గవాయికి బీఎస్పీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుంది. దాడిని తీవ్రంగా ఖండించాలి. తెలుగు నేలపై మహాత్మా పూలే, అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో పోరాడుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ కుల సంఘాల నాయకులు జస్టిస్ బి.ఆర్ గావాయి పై జరిగిన దాడిని గమనించాలి. సనాతన ధర్మం ముసుగులో జరుగుతున్న ఇటువంటి అమానవీయ దాడులను తీవ్రంగా ఖండించాలి. రాజ్యాధికారం దిశగా అడుగులు వెయ్యాలని అన్నారు.

కాలనీల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర , కాప్రా : మల్లాపూర్‌లోని పాలు కాలనీల్లో బాక్స్ డ్రెయిన్ పూడికతో మంచి నీటిపైప్ పగలడం వల్ల సుమారు వారం రోజులుగా ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల కష్టాలను గుర్తించిన మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ సొంత నిధులతో తాగునీటి సరఫరా ఏర్పాటు చేసి స్థానికులకు నీళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వాటర్ బోర్డు ఏ ఈ శ్రీరాజ్, శ్రీనివాస్, సురేష్, మైథిల్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు సాయి కిరణ్ గౌడ్ సేవాభావాన్ని అభినందించారు.

ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గావాయిపై దాడి చేయడం హెయమైన చర్య అని రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్థలో నిరసన తెలిపిన బీఆర్ఎస్పి పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పచ్చ అనిత ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీమ్ కోర్ట్ మన రాజ్యాంగానికి రక్షకుడు.అది మన ప్రజాస్వామ్యానికి ప్రాణం, న్యాయం కోరిన ప్రతి పౌరుడి చివరి ఆశ్రయం అక్కడే మన హక్కులు, స్వేచ్ఛలు, న్యాయమన్న విశ్వాసం నిలుస్తాయి . అలాంటి మహత్తరమైన సంస్థకు నాయకత్వం వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పైకేవలం వ్యక్తిగత దాడి కాదు. ఇది భారత రాజ్యాంగం మీద దాడి, ప్రజాస్వామ్యం మీద దాడి, న్యాయం మీద దాడి భారతదేశానికే ఘోర అవమానం అని న్యాయస్థానం స్వతంత్రంగా ఉంటేనే ప్రజాస్వామ్యం నిలుస్తుంది. న్యాయమూర్తి గౌరవం కూలిపోతే, దేశ ప్రతిష్ఠ కూలిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగ్జీవన్ జయంతి కమిటీ మాజీ అధ్యక్షులు పంబల రాజు, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గొడుగు సంజీవ, అంబేద్కర్ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పచ్చ నర్సింగ్ , ఇటాల వెంకటేష్‌రావు ప్రీతం రాజ్, కార్తీక్ నాని, చాంది, ఆనందం, తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

న్యాయమూర్తిపై దాడికి నిరసన

విశాలాంధ్ర - తుర్కయంజల్ : సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి మీద జరిగిన దాడి నేపథ్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని నిన్న జరిగిన సంఘటన భారత రాజ్యాంగం మీద దాడి అని, అత్యున్నత న్యాయస్థానంలో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి మీద దాడి అంటే ఈ దేశం మీద దాడి అని, సనాతన ధర్మం పేరు మీద రాకేష్ కిషోర్ అనే లాయర్ చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రధాన న్యాయమూర్తి దళితుడు అయినందున, మనువాదం తలకెక్కిన వ్యక్తి బూటు విసిరేసా డని, ఈ చర్య ను తీవ్రంగా ఖండిస్తూ నిందితుడిని కఠినంగా శిక్షించేలా భారత ప్రభుత్వం చర్య తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓరుగంటి యాదయ్య, బిజెపి రాష్ట్ర నాయకులు బచ్చిగల్ల రమేష్, బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ, మాజీ అధ్యక్షులు వదిగల్ల బాబు , మేతరి కుమార్, ఉపాధ్యక్షులు లపంగి రాజు, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, భూతం రమణ, సిపిఎం నాయకులు కిషన్, ఆశీర్వాదం, సత్యనారాయణ, జ్యోతి బస్, అంబేద్కర్ యువజన సంఘ ఉపాధ్యక్షులు కొమ్మని దర్శన్, గోపాల్, వినోద్ సాయి భగత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల మధ్య ముసలం

- మంత్రి అడ్లూరికి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ ఫోన్
- పొన్నంపై అడ్లూరి ఆగ్రహం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల వేళ మంత్రుల మధ్య మొదలైన ముసలం పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. తాజాగా మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మనస్పర్థలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మహేష్ గౌడ్ ఫోన్ చేయడంతో ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని మహేష్ గౌడ్ సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రి పొన్నంపై అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలు అంటే అంత చిన్న చూపా..? అని లక్ష్మణ్ ప్రశ్నించినట్లు సమాచారం. పొన్నం వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడటం తనకురాదని తెలిపారు. మంత్రి వివేక్ లాగా తన దగ్గర డబ్బులు లేవని స్పష్టం చేశారు. తాను మంత్రి కావడం, ఆ సామాజిక వర్గంలో పుట్టడం తన తప్పా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తానని వివరించారు. తాను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నారని చెప్పారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను ఆదిలాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

మామధ్య కేవలం కమ్యూనికేషన్. గ్యాప్ : మంత్రి పొన్నం

నేను దున్నపోతు అన్నప్పుడు.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేరును ఎక్కడా ప్రస్తావించలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం విషయం టిపిసిసి వరకు చేరుకోవడంతో మంత్రి పొన్నం ఈ అంశంపై స్పందించారు. ముఖ్యంగా దున్నపోతు అన్న వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. కమ్యూనికేషన్ గ్యాప్ తప్ప ఇంకేం లేదని, ఈ విషయంపై అడ్లూరితో మాట్లాడేందుకు ప్రయత్నించాను.. కానీ అందుబాటులోకి రాలేదు. దీనిపై మహేష్ కుమార్ గౌడ్‌తో కూడా మాట్లాడినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

మంత్రి ప్రభాకర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : ఇటీవల ఓ సమావేశంలో తెలంగాణ మాదిగ సమాజాన్ని కించపరిచేలా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పొన్నం ప్రభాకర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాదిగ హక్కుల దండోరా (ఎం.హెచ్.డీ) రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో హుస్నాబాద్ లో భవిష్యత్ లో గెలువకుండా చేస్తామని అన్నారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించినప్పటి నుంచి మాదిగ జాతి అండగా అండగా నిలబడిందని గుర్తు చేశారు. దళితుడు తమ పక్కన సమానంగా కూర్చుంటే జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించాలని అన్నారు. లేక లేక పది సంవత్సరాల తర్వాత దళితుడికి మంత్రివర్గంలో స్థానం వస్తే జీర్ణించుకోలేరా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు బుగ్గ మైసయ్య, కవంపల్లి రవి, మేతరి రోజా రాణి, దప్పు వీరస్వామి, తప్పెట్ల ప్రవీణ్, ఎలకపల్లి రాజేందర్, పోచన్న వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అండగా ఎన్ఆర్ఐలు: మధుయాష్కిగౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అమెరికాలోని న్యూజెర్సీ చాప్టర్ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రదీప్ కొటారి, ఇన్చార్జి హర్యేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జయంతి ఉత్సవాలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదరు వేడుకలకు మధుయాష్కికి ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. తాను అమెరికాలో నివాసం ఉన్నప్పటి స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మధుయాష్కితో తమకున్న అనుబంధాన్ని, ఆత్మీయతను పంచుకున్నారు. న్యూ జెర్సీ చాప్టర్ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆవిర్భావం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఓసీ లో పలువురు ఎన్ఆర్ఐలు చేరారు. ముఖ్యంగా గుజరాత్ రాష్ట్ర చెందిన పలువురు ఎన్నారైలు ఐఓసీలో చేరారు. వారికి మధుయాష్కి కండువాలు కప్పి ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. అంతేకాకుండా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో కార్యవర్గ ప్రతినిధులకు ఈ సందర్భంగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో చేరేందుకు చాలా మంది ఎన్నారైలు ఎంతో ఆసక్తి చూపుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వంపై ఎన్నారైల నుంచి వ్యతిరేకత ఏర్పడిందన్నారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన గడ్డ అయిన గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఎన్నారైలు.. మోదీ - బిజెపి ప్రభుత్వ నిజ స్వరూపం తెలుసుకుని కాంగ్రెస్ వైపు ఆకర్షితులైతున్నారన్నారు. విదేశాంగ విధానంలోనూ మోదీ ప్రభుత్వం విఫలమైందని, పబ్లిసిటీ స్టంట్ తప్ప మోదీ అమెరికాతో వాణిజ్య విధానాలలో వైఫల్యం చెందారన్నారు. అడ్డగోలు టారిఫ్‌లతో భారత వ్యాపార రంగం పై ప్రభావం పడుతున్నప్పటికీ.. ట్రంప్ తన మిత్రుడే నన్న మోదీ మాత్రం నోరు మెదపటం లేదన్నారు. భిన్నత్వంలో ఏకత్వం, లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా మహాత్మా గాంధీ, పటేల్ కోరుకున్న తీరుకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. భారత్ జోడోయాత్ర, ఓటర్ అధికార్ యాత్ర తదితర కార్యక్రమాలతో మోదీ ప్రభుత్వం చేపడుతున్న రాజ్యాంగ విలువల ధ్వంసం పై.. రాహుల్ గాంధీ పోరాడుతున్న తీరు మీ అందరికీ తెలిసిందేనన్నారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపడుతున్న పోరాటంలో ఎన్నారైల మద్దతు కాంగ్రెస్ కు ఎంతో అవసరమన్నారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ బలోపేతానికి శ్యామ్ పిట్రోడ, ప్రదీప్ కొఠారి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఓసీ తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ గంగసాని, ఐఓసీ యూఎస్ఏ వైస్ ప్రెసిడెంట్ బాల్దేవ్ రంధ్వ, రామ్ గడుల, ఐఓసీ తెలంగాణ జనరల్ సెక్రటరీ సుధీర్ బండి తదితరులు పాల్గొన్నారు.

టూరిజం పోలీసులకు శిక్షణ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణలో తొలిసారిగా 80 మంది టూరిజం పోలీస్ సిబ్బందితో కూడిన బ్యాచ్‌కు సంబంధించిన వారంరోజుల శిక్షణ కార్యక్రమం నేడు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో ప్రారంభమైంది. టూరిజం శాఖ, తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమం రాష్ట్రంలోని ముఖ్య పర్యాటక కేంద్రాలలో నియామకం కానున్న టూరిజం పోలీస్ సిబ్బందిని సన్నద్ధం చేయడానికి రూపొందించబడింది. 'ఓరియంటేషన్ అండ్ సెన్సిటైజేషన్ ఆఫ్ టూరిస్ట్ పోలీస్' అనే శీర్షికతో నిర్వహిస్తున్న ఈ శిక్షణా శిబిరం పర్యాటకుల భద్రతను బలోపేతం చేయడం, సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడం, మరియు సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ మహేష్ ఎం. భగవత్, ఐపిఎస్, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్), తెలంగాణ పోలీస్ ప్రధాన అతిథిగా ప్రారంభించారు. ఇతర విశిష్ట అతిథులు ప్రొ. వి. వెంకట రమణ, డైరెక్టర్, నిథమ్‌బీ శ్రీ ఎం. రమణ కుమార్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, తెలంగాణ ప్రభుత్వంబీ శ్రీ ప్రకాష్ అమ్మనౌలు, ఛైర్మన్, ఎఫ్టీసీసీఐ టూరిజం కమిటీబీ మరియు శ్రీ డి. రామచంద్రం, కో-ఛైర్మన్, ఎఫ్టీసీసీఐ టూరిజం కమిటీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ ఎం. భగవత్ మాట్లాడుతూ 'పర్యాటకుల భద్రతను బలోపేతం చేయడానికి, సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి, పోలీస్ శాఖ యువజనాభివృద్ధి, పర్యాటక అండ్ సాంస్కృతిక శాఖతో సమన్వయం చేసుకొని రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక కేంద్రాల్లో శిక్షణ పొందిన టూరిజం పోలీస్ సిబ్బందిని నియమించింది. ప్రొ. వి. వెంకట రమణ, డైరెక్టర్, నిథమ్, పాల్గొన్న వారిని స్వాగతిస్తూ, పర్యాటక అభివృద్ధి కోసం నిథమ్ చేస్తున్న శిక్షణా, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెలంగాణకు అంతర్జాతీయంగా మంచి ఇమేజ్ తీసుకురావడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని, దీనిపై ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ దృష్టి సారిస్తున్నారని ఆయన గుర్తుచేశారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన కోసం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేసిన కృషి ఫలించింది. రాజేంద్రనగర్ సర్కిల్-11 పరిధిలోని డివిజన్లలో అత్యవసరంగా నిర్మించాల్సిన సీసీ రోడ్ల పనుల మంజూరుకై ఎమ్మెల్యే ఇటీవల చార్మినార్ జోనల్ కమిషనర్ ను కలిసి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.దీనితో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభ్యర్థన మేరకు మైలార్‌దేవపల్లి డివిజన్ రాజేంద్రనగర్ డివిజన్లతో సహా పలు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనుల కోసం జీహెచ్ఎంసీ అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ జారీ చేసింది అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్యాంప్ కార్యాలయంలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో రోడ్ల ఒకటి. ముఖ్యంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీసీ రోడ్లు అత్యవసరం. ప్రజల తరఫున నేను చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని రూ.10 కోట్ల విలువైన పనులకు త్వరితగతిన ఆమోదం తెలిపిన చార్మినార్ జోనల్ కమిషనర్‌కి నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ నిధులతో రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాను అని తెలిపారు.

120 కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం పరిధిలో పోలీసులు మరో పెద్ద మాదకద్రవ్య రవాణా కేసును ఛేదించారు. కోదాడ పట్టణ పోలీసులు, జిల్లా CCS బృందం సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో రూ.60 లక్షల విలువైన 120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశారు. విస్తృత తనిఖీలు, సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు జిల్లాలో గంజాయి రవాణా, సరఫరా, వినియోగం, అమ్మకాలను అరికట్టేందుకు పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ కె. నరసింహ తెలిపారు. గత నెల 23న కోదాడ పట్టణ పరిధిలో జాతీయ రహదారి వెంబడి గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన 110 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఆ కేసు దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలు, సీసీ ఫుటేజీలు, నమ్మదగిన సమాచారం ఆధారంగా మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కట్టకొమ్ముగూడెం వద్ద వాహన తనిఖీలలో పట్టుబడిన నిందితులు సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని కటకొమ్ముగూడెం ఎక్స్‌రోడు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఒక కారు అనుమానాస్పదంగా వేగంగా వెళ్లింది. పోలీసులు వెంటాడి ఆ కారును ఆపగా, కారులో 10 కేజీల గంజాయి లభించింది.దీంతో ప్రధాన నిందితుడు కణం రమేష్ (52) ను అదుపులోకి తీసుకున్నారు. అతని సమాచారంతో మరో ఇద్దరు నిందితులు చాపల అశోక్ (33), చాపల ఎరకమ్మ అలియాస్ రోహిణి (37) లను విజయవాడలో అరెస్ట్ చేశారు.ఎస్పీ వివరాల ప్రకారం, ఎ-1 కణం రమేష్ బియ్యం వ్యాపారం చేస్తూ నష్టాలు ఎదుర్కొని అప్పుల్లో చిక్కుకున్నాడు. మానసిక ప్రశాంతత కోసం ఆశ్రమాలలో తిరుగుతుండగా ఎ-3 ఎరకమ్మతో పరిచయం ఏర్పడింది.ఇద్దరూ కలిసి గంజాయి వ్యాపారం చేస్తే త్వరగా డబ్బు వస్తుందని పథకం వేసుకున్నారు. ఎ-2 అశోక్ ద్వారా ఒడిశా నుండి గంజాయి తెప్పించి విజయవాడ-హైదరాబాద్ మార్గంలో రవాణా చేస్తున్నారు. గత నెలలో కోదాడ పట్టణ పరిధిలో 110 కేజీల గంజాయిని వదిలేసి పారిపోయినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన కోదాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, CCS ఎస్ఐ హరికృష్ణ, ఎస్ఐ హనుమనాయక్ మరియు పోలీసు సిబ్బందిని ఎస్పీ నరసింహ అభినందించి రివార్డుతో సత్కరించారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, "జిల్లాలో గంజాయి రవాణా, సరఫరా, వినియోగం, అమ్మకాలపై పటిష్ఠ నిఘా కొనసాగుతుంది. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై NDPS చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.

ముంబయి మీటియర్స్ గెలుపు జోరు

కాలికట్ హీరోస్‌పై 3-0తో మరో ఘన విజయం

విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: ఆర్ఆర్ కేబుల్ ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో ఎడిషన్‌లో ముంబయి మీటియర్స్ వరుసగా రెండో విజయం సొంతం చేసుసుకుంది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబై 3-0 తేడాతో (15-9, 15-8, 15-12) వరుస సెట్లలో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌పై తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో ముంబయి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ముంబై కెప్టెన్ అమిత్ గులియాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఆట ప్రారంభంలో కాలికట్ హీరోస్ కెప్టెన్, సెట్టర్ మోహన్ ఉక్కరపాండియన్ మధ్యలోకి పాస్‌లు అందిస్తూ అటాకింగ్‌లో వైవిధ్యం చూపించే ప్రయత్నం చేశాడు. అయితే, ముంబై బ్లాకర్ అభినవ్ సలార్ గోడలా నిలిచి కాలికట్ దాడులను సమర్థవంతంగా అడ్డుకున్నాడు. ఆట మధ్యలో ఉక్కరపాండియన్ చేసిన డబుల్ టచ్ తప్పిదం ముంబైకి కీలకమైన సూపర్ పాయింట్‌ను అందించింది. దీంతో ముంబై తొలి సెట్ నెగ్గి ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత శుభమ్ చౌదరి తన పదునైన స్పైక్‌లతో కాలికట్ డిఫెన్స్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. అతనికి మథియాస్ మథియాస్ లోఫ్టెసెన్స్ కూడా తోడవడంతో ముంబై పాయింట్ల వేటలో దూసుకుపోయింది. కాలికట్ తరఫున డెట్ బోస్కో తన పవర్‌ఫుల్ ఎటాక్స్‌తో ప్రమాదకరంగా కనిపించాడు. కాలికట్ చేసిన అనవసర తప్పిదాలు ఆ జట్టును దెబ్బతీశాయి. వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న ముంబై ముందంజ వేసింది. మధ్యలో సంతోష్, వికాస్ మాన్ కొంత ప్రతిఘటించినా, ముంబై కెప్టెన్ అమిత్ గులియా తన వ్యూహాలతో జట్టును ప్రశాంతంగా నడిపించాడు. తమ ప్రణాళికలను ఖచ్చితంగా అమలు చేసిన ముంబై ఈ సీజన్‌లో తమ విజయ పరంపరను కొనసాగించింది.

బీఆర్ఎస్ జెండా ఎగరాలి : కార్పొరేటర్లు

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆకాంక్షించారు. మంగళవారం యూసఫ్ గూడా కార్పొరేటర్ రాజ్కుమార్ పటేల్, వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ, అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి, బుద్ధ నగర్ కార్పొరేటర్ కంది శైలజ, జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత ని శ్రీనగర్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఫ్యానుకు ఉరేసుకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర- కొత్తూరు: భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉ రేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధి తిమ్మాపూర్ లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రవిరాజ్ (31)కి ఆరు సంవత్సరాల క్రితం మొయినాబాద్ మండలం, బాకారం గ్రామానికి చెందిన రాములు కుమార్తె లాస్యతో వివాహం జరిగింది. అప్పటినుండి భార్య భర్తలు బాగానే కలిసి ఉన్నారు. వీరికి సంతానం కలుగలేదు. రవిరాజ్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో గత ఐదు నెలల క్రితం భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో లాస్య అలిగి పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటినుండి రవిరాజ్ తన తల్లితో కలిసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈనెల 4న తన తల్లి కమలమ్మ అనారోగ్యానికి గురి కావడంతో అక్క భూలక్ష్మితో కలిసి షాద్నగర్‌లోని ఒ ఆసుపత్రికి వెళ్లి అక్కడే పెద్ద కూతురు వద్ద ఉండిపోయింది. తిరిగి మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు లోపలి నుండి గడియ పెట్టి ఉండడం గమనించి ఎంత పిలిచిన స్పందించకపోవడంతో చుట్టుపక్కల వారు ఇక్కడికి చేరుకొని తలుపులు పగలగొట్టి చూసేసరికి రవి రాజ్ మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతుని తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ జి నరసయ్య వివరించారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

విశాలాంధ్ర -ఖమ్మం: ఓట్ల దొంగలు గద్దె దిగండి అనే ఉద్యమం పిలుపులో భాగంగా ఓట్ల చోరీపై సంతకాల సేకరణకు కాంగ్రెస్ నాయకులు నడుం బిగించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ఓట్ల చోరీపై సంతకాల సేకరణ చేపట్టాలని కోరారు. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుపై ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అక్రమాలను ఎండగట్టి ,ప్రజాభిప్రాయ సేకరణకు సంతకాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీ పి సి సి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్, జిల్లా ఓ బి సి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, బోజెడ్ల సతీష్, సూరంశెట్టి కిషోర్, కొమ్మినేని రమేష్ బాబు, గాలి దుర్గారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటేసేలా ఈసీ హామీ ఇవ్వాలి

- పెద్ద పార్టీలకు పట్టువిడుపులు అవసరం
- చిన్న పార్టీలకు సముచిత స్థానాలు కేటాయించాలి
- వామపక్షాల పునరేకీకరణే లక్ష్యం
- బీహార్‌లో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరగాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆకాంక్షించారు. అర్హులైన ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోగలగాలని, ఇందుకు ఎన్నికల సంఘం హామీ ఇవ్వాలని, అది ఆ సంస్థ రాజ్యాంగబద్ధ కర్తవ్యమని అన్నారు. బీహార్ 24 స్థానాల్లో పోటీ చేయాలని సీపీఐ కోరుకుంటోందని, ఆ మేరకు ఏకాభిప్రాయం కుదురుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. డి.రాజా మంగళవారం బీహార్‌లో పర్యటించారు. ఇండియా భాగస్వామిగానే కాకుండా బీహార్‌లో ప్రతిపక్ష మహాకూటమిలో సీపీఐ ఉన్న నేపథ్యంలో బీహార్‌లో సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. వీటిలో పాల్గొనేందుకు రాజా పట్నా చేరుకున్నారు. ఇదే క్రమంలో విలేకరుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఓ ఛానల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. సీట్ల సర్దుబాటుపై చర్చలు త్వరలోనే కొలిక్కివస్తాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సముచిత స్థానాల్లో పోటీ చేసేందుకుగాను పెద్ద పార్టీల మద్దతు కోరుతున్నట్లు తెలిపారు. 'ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించింది. ఎస్ఐఆర్‌పై అనేక ప్రశ్నలు వచ్చాయి. సుప్రీంకోర్టు జోక్యం తర్వాతే ఆధార్, ఇతర పత్రాలను ఈసీ అనుమతించింది' అని రాజా అన్నారు. ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను పునరుద్ధరించుకోవాలని, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా ఈసీ హామీనివ్వాలన్నారు. బీహార్ అసెంబ్లీలో 243 స్థానాలు ఉండగా, 24 చోట్ల పోటీ చేస్తామని సీపీఐ ఇప్పటికే వెల్లడించింది. 2020లో ఆరు స్థానాల్లో పోటీ చేసిన సీపీఐ రెండు సీట్లు గెలుచుకుంది. ఈసారి మంచి ప్రదర్శన ఇవ్వగలమన్న ధీమాతో ఉంది. ఇదే క్రమంలో డి.రాజా మాట్లాడుతూ పెద్ద పార్టీలకు పట్టువిడుపు అవసరమని, చిన్న పార్టీలకు సముచిత స్థానాలు కేటాయించాలని అన్నారు. ఈసారి ఎన్నికల ప్రచారాన్ని సీపీఐ పెద్దఎత్తున నిర్వహిస్తుందని చెప్పారు. ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్‌తో ముఖాముఖి భేటీలో కీలక అంశాలపై చర్చించి సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు. ప్రతిపక్ష కూటమి తరపున సీఎం అభ్యర్థిగా తేజస్వికి మద్దతు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. కమ్యూనిస్టు భావజాలం, సిద్ధాంతాల బలం తగ్గలేదని డి.రాజా నొక్కిచెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు పెరిగినా పార్లమెంటులో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగినా ప్రస్తుత సామాజిక నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూపగల సామర్థ్యం కమ్యూనిస్టులకు ఉందని వక్కాణించారు. కులరహిత సమాజ స్థాపన కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. మతతత్వవాదం, ఫాసిస్టు శక్తులపై రాజీలేని పోరాటానికి సీపీఐ కట్టుబడి ఉందని, పార్టీ బలాన్ని పెంచుకుంటూనే ఈ పోరాటాన్ని సాగిస్తామని డి.రాజా అన్నారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు అన్ని ఎన్నికల్లోనూ సీపీఐ పోటీ చేస్తుందని చెప్పారు. వామపక్ష ఐక్యతను పెంచడం కోసం ఇతర కమ్యూనిస్టు పార్టీల అగ్ర నాయకులను చండీగఢ్‌లో నిర్వహించిన సీపీఐ జాతీయ మహాసభలకు ఆహ్వానించినట్లు వెల్లడించారు. శతవార్షికోత్సవం సందర్భంగా వామపక్ష పార్టీల పునరేకీకరణ కోసం పిలుపునిచ్చాం... ఆ దిశగా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని డి.రాజా తెలిపారు. బీహార్‌లోనే కాకుండా 2026లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపైనా సీపీఐ దృష్టిని కేంద్రీకరించిందన్నారు. పశ్చిమ బెంగాల్ వామపక్షాల పునరుద్ధరణే తమ లక్ష్యమన్నారు. తమ పార్టీతో పాటు ఇండియా అభ్యర్థుల తరపున ప్రచారం కోసం బీహార్‌లో సీపీఐ నాయకులు తరచూ పర్యటిస్తారని రాజా చెప్పారు. ప్రజలను అన్ని విధాలుగా మభ్యపెట్టేందుకు, ఏదో ఒక రకంగా వారిని తమ వైపునకు తిప్పుకోవాలని బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోందని, తమిళనాడులో పట్టు కోసం భారీగా ఖర్చుచేస్తోందని విమర్శించారు. బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ఎన్నికల్లో ముందుకెళుతున్నట్లు డి.రాజా వెల్లడించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 6, 11 తేదీల్లో జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు 14న జరగనున్నది.

19 స్థానాలకు ఒప్పుకోం

40 అడిగాం... కనీసం 30 ఇవ్వాలి: సీపీఐ(ఎంఎల్)

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేయాలనే దానిపై ప్రతిపక్ష కూటమిలో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 19 స్థానాల్లో పోటీ చేయాలన్న ప్రతిపాదనను సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తిరస్కరించింది. గౌరవమైన ప్రతిపాదన కాబట్టే తిరస్కరించినట్లు పార్టీ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇన్నే స్థానాలు కేటాయించారు... కనీసం మూడు స్థానాలు మార్చారు. '2020 ఎన్నికల్లో 12 చోట్ల గెలించాం. ఈసారి 40 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నాం. కనీసం 30 స్థానాల్లో పోటీ చేసేలా కొత్త ప్రతిపాదన సిద్ధం చేస్తాం. అంటే దాదాపు 25 శాతం స్థానాలు తగ్గిస్తున్నాం. 19 స్థానాల్లోనే పోటీ చేయమనడం సముచితం కాదు. అందుకు ఒప్పుకోం' అని పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు. గత ఎన్నికల్లో మహాకూటమి పోటీ చేసిన స్థానాల్లోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ఓట్లు సమకూరేలా సీపీఐ(ఎంఎల్) గణనీయమైన తోడ్పాటు అందించిందని అన్నారు. కొత్త ప్రతిపాదనను ఆమోదించకపోతే ఏం చేస్తారన్న ప్రశ్నకు 'మాకు అన్ని అవకాశాలు ఉన్నాయ'ని ఆ నాయకుడు బదులిచ్చారు. కాగా, మహాకూటమిలో కాంగ్రెస్, ఆర్‌జేడీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), వికాశ్‌శీల్ ఇన్సాన్ (వీఐపీ) భాగస్వాములుగా ఉండటం విదితమే. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేయగా 75 చోట్ల గెలిచింది. 70కుగాను 19 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది.

రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పట్టణాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి నారాయణ అన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌కు మంత్రి నారాయణ హాజరయ్యారు. రాష్ట్రంలోని 77 మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లతో మూడు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు 29 మున్సిపాలిటీల అధికారులు హాజరయ్యారు. పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. 2029లోగా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పట్టణాభివృద్ధిపై అధికారులకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేశారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని సూచించారు. ఇళ్లలో వాడే నీళ్లతో పాటు వర్షపు నీరు కోసం కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రెండేళ్లలో అమృత్ పథకం–2 ద్వారా మున్సిపాలిటీలలోని 90 శాతం ఇళ్లకు తాగునీరు అందిస్తామని నారాయణ తెలిపారు. టిడ్కో ఇళ్ల నిర్మాణంపైనా సూచనలు చేశారు. ప్రతి శనివారం లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలన్నారు. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు. వర్క్‌షాప్‌లో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర రావు పాల్గొన్నారు.

ప్రత్యేక కమిషన్‌తో కులగణన

- బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం
- స్థానిక ఎన్నికలకు ముందే అమలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- గవర్నరుకు రాజకీయ, బీసీ సంఘాల ప్రతినిధుల బృందం విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకు ముందే విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల తరహాగా రాష్ట్రంలోను జనగణనలో కులగణన చేపట్టాలని, ఆ దిశగా స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేలా కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరామన్నారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు రామకృష్ణ నేతృత్వంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, పార్టీ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పీసీసీ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, బీసీ సంఘాల నేతలు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, జి.యలమందరావు, కుమ్మర కృష్ణకుమార్, సమాజ్‌వాద్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకులు ఆర్ఎస్ యాదవ్ తదితర నాయకులతో కూడిన బృందం మంగళవారం వినతిపత్రం అందజేసింది. విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి బీసీలకు దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ కీలక చర్యలు అమలయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను వాయిదా వేయాలని అభ్యర్థించింది. అనంతరం రాజ్‌భవన్ ఎదుట వివిధ రాజకీయ, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకరులతో రామకృష్ణ మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సామాజిక–ఆర్థిక పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేయడానికి, కచ్చితమైన ఆధారాలతో విధాన ప్రణాళిక కోసం ఒక ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించామని వివరించారు. బీసీ కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించిన తర్వాత వాస్తవ వెనుకబడిన తరగతుల జనాభాను ప్రతిబింబించే ఫలితాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థలలో బీసీలకు దామాషా విధానంలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉపాధిలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నమూనాను గవర్నరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు... గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రాజ్యాంగ బద్ధ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, అడ్డంకులు కొనసాగుతున్నప్పటికీ బీసీలను రక్షించడానికి రాష్ట్ర స్థాయిలో నిర్ణయాత్మక కార్యనిర్వాహక చర్య సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాటి చెప్పిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థల ప్రస్తుత పదవీకాలం ఏప్రిల్ 2025 వరకు పొడిగించారని... రాష్ట్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రభుత్వం షెడ్యూల్‌ను ముందుకు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తోందన్నారు. 2026 జనవరిలో ఎన్నికలు నిర్వహించాలని, ఈ సందర్భంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు పెండింగ్‌లో ఉన్న అన్ని అడ్డంకులను మొదటి కుల జనాభా గణన ద్వారా పరిష్కరించాలని, దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరగా... ఆయా అంశాలపై గవర్నరు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కేశన శంకరరావు మాట్లాడుతూ, కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులను పరిష్కరించే దిశగా కృషి చేయాలని, ఈ కీలకమైన సమస్యలను పరిష్కరించకుండా ఎన్నికలను ముందుకు తీసుకెళ్లడం వల్ల రాష్ట్రంలోని బీసీ జనాభాలో దాదాపు 56శాతం మందికి సామాజిక న్యాయం కొరవడుతుందని గవర్నరు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర అంశాలలో కుల గణనను నిర్వహించడానికిగాను రాష్ట్ర కుల గణన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

జగన్ పిచ్చి ప్రేలాపనలు: కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో–మచిలీపట్నం: పేదలకు నాణ్యమైన వైద్యం, పేద విద్యార్థులకు ఉచితంగా వైద్యవిద్య అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ 17 మెడికల్ కాలేజీల గురించి మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్ ఎన్నింటిని పూర్తి చేశారో చెప్పగలరా? రాష్ట్రం ఇచ్చిన నిధులెంతో చూపించగలరా? అని ప్రశ్నించారు. బందరు మెడికల్ కాలేజీకి రావాలని సవాల్ చేశారు. మూడు–నాలుగు కాలేజీల్లో అరకొర పనులు చేసి బిల్లులు కొట్టేయడం తప్ప జగన్ చేసిందేమీ లేదన్నారు. పాడేరు మెడికల్ కాలేజీలో సదుపాయాలు లేక 50 సీట్లు ఇవ్వాల్సి వచ్చిందని, 15 శాతం ఎన్ఆర్ఐ కోటా, 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ కోటా నిర్ణయించింది ఎవరో జగన్ సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థులకు మెడికల్ సీట్లు, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ధర్నాలు, రాస్తారోకోలు అంటూ రాద్ధాంతం చేస్తే ప్రజలు సహించరన్నారు. కమిషన్ల కోసం గంగవరం పోర్టు, కో–ఆపరేటివ్ మిల్క్ ఫ్యాక్టరలు, ప్రైవేటుపరం చేసింది జగన్ కాదా అని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులను ఓర్వలేక జగన్ కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. మద్యం విషయంలో వైసీపీ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. తంబళ్లపల్లి ఘటన ముద్దాయికి చెందిన గోదాములో కల్తీమద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా జరుగుతోందని, తయారీ నుంచి అమ్మకం వరకు ట్రాక్ చేస్తున్నామన్నారు. జగన్‌కు ప్రజలే బుద్ధిచెప్పారని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.

ప్రపంచానికి జ్ఞాన జ్యోతి చూపించిన వాల్మీకి మహర్షి

ప్రజలకు బాబు, పవన్, జగన్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్ఞాన సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని చంద్రబాబు కొనియాడారు. మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుందన్నారు. ఆదికావ్యం రామాయణ మహా గ్రంథాన్ని రచించి యుగయుగాలకు శ్రీరామచంద్రుని దివ్య చరిత్రను అందించిన మహనీయుడు ఆదికవి వాల్మీకి మహర్షి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రపంచానికి రామాయణ ఇతిహాసాన్ని అందించిన మహర్షి వాల్మీకి అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. వేటగాడైన వాల్మీకి రామనామాన్ని జపిస్తూ మహర్షిగా మారిన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు.

ఆర్‌టీసీ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి జయంతి

ఆర్‌టీసీ హౌస్ (విజయవాడ) లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు విచ్చేసి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ పాణిచక్ర తేజ, ప్రధాన కార్యాలయ ఈడీలు రవివర్మ, చంగల్ రెడ్డి, జోన్ల ఈడీలు బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, నాగేంద్ర ప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మానవతావాది యస్ఆర్ శంకరన్ ఆదర్శప్రాయుడు

వర్ధంతి సభలో జల్లి విల్సన్

విశాలాంధ్ర–విజయవాడ: ఉన్నతాధికారిగా విశేషమైన సేవలందిస్తూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం పరితపించిన గొప్ప మానవతావాది యస్ఆర్ శంకరన్ ఆదర్శప్రాయుడని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. మాజీ ఐఏఎస్ అధికారి యస్ఆర్ శంకరన్ 15వ వర్ధంతి సందర్భంగా మంగళవారం విజయవాడ ఐక్యతా భవన్‌లో యస్ఆర్ శంకరన్ విగ్రహానికి జల్లి విల్సన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పేద ప్రజలకు చేరవల్సిన నిజమైన సంక్షేమంపై నిరంతం ఆలోచించి అనేక చట్టాలను రూపొందించి రాజకీయ నాయకులను, ముఖ్యమంత్రులను సైతం ఒప్పించగలిగారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నివారణ చట్టం, భూ సంస్కరణ, అసైన్డ్‌మెంట్ చట్టాలు, గ్రామీణ ఉపాధి చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి ఎన్నో చట్టాలను సమర్థవంతంగా రూపొందించారని గుర్తు చేశారు. కోట్లాది మంది పేదలకు అండగా నిలిచిన శంకరన్ స్ఫూర్తితో చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య, హెల్ప్‌ది హోప్‌లెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాధాకృష్ణ, కురాకుల స్టాలిన్, కాళ్ల ప్రకాశరావు, ఐక్యతా భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం

జగన్ దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణ, యథేచ్ఛగా సాగుతున్న కల్తీ మద్యం వ్యవహారాలను ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చొరవ చూపాలని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులతో మంగళవారం జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితి, కూటమి పాలనపై మాట్లాడారు. పార్టీ కార్యాచరణను ప్రకటించారు. కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి, గవర్నరుకు సమర్పించనున్నట్లు జగన్ వెల్లడించారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కూటమి రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం యూనిట్లు ఏర్పాటు చేశారని, ప్రాంతాలను పంచుకున్నారని కూటమి పాలనను దుయ్యబట్టారు. కృష్ణా, గుంటూరు జిల్లాలో ఈ సామ్రాజ్యాన్ని విస్తరింపజేసేందుకు విజయవాడ చేరువలోని ఇబ్రహీంపట్నంలో రెండు చోట్ల భారీగా నకిలీ మద్యం ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారన్నారు. నకిలీ మద్యానికి అమాయకులు బలవుతున్నారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా దారుణంగా మారాయని జగన్ వెల్లడించారు.

సీజేఐపై దాడిని నిరసిస్తూ ఆప్ ఆందోళన

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి అని వివిధ రాజకీయ పక్షాలు ఆరోపించాయి. సీజేఐపై దాడిని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మంగళవారం తూర్పు ఢిల్లీలోని మయూర్ విహార్ లో నిరసన ప్రదర్శన నిర్వహించింది. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చిత్రపటాలను చేత పట్టుకుని... ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ నేతృత్వంలోని పార్టీ కార్యకర్తలు 'జై భీమ్' నినాదాలు చేశారు. 71 ఏళ్ల న్యాయవాది అయిన దాడి చేసిన వ్యక్తిని ఖండిస్తూ నిరసనకారులు 'హల్లా బోల్', 'చీఫ్ జస్టిస్ కా అప్మాన్ నహి సహేగా హిందూస్తాన్' అని నినాదాలు చేశారు. భరద్వాజ్ బూట్ల దండను ధరించారు. సోమవారం సుప్రీం కోర్టులోని తన కోర్టు గదిలో సీజేఐ గవాయ్ వైపు ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించాడు. దాడి నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాది రాకేశ్ కిశోర్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసింది.

మహారాష్ట్రలో ఎన్‌సీపీ(ఎస్‌పీ) నిరసనలు

సీజేఐ బి.ఆర్.గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరే ప్రయత్నాన్ని ఖండిస్తూ ఎన్‌సీపీ (ఎస్‌పీ) నాయకులు మంగళవారం ముంబై, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేయడానికి చేసిన ప్రయత్నమని విమర్శించారు. వందలాది మంది నిరసనకారులు హుతాత్మ చౌక్ వద్ద గుమికూడారు. వారిలో కొందరు తరువాత దక్షిణ ముంబైలోని మంత్రాలయ సమీపంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్త ఒకరు మాట్లాడుతూ తాము మొదట హుతాత్మ చౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించాలనుకున్నామని, కానీ అనుమతి నిరాకరించారని చెప్పారు. ఎన్‌సీపీ(ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు శశికాంత్ షిండే, పార్టీ ముంబై అధ్యక్షుడు రాఖీ జాదవ్, ఇతర మద్దతుదారులు దాడిని ఖండిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మరికొంతమంది నిరసనకారులు డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన నినాదాలు చేశారు. అలాగే ఛత్రపతి శంభాజీనగర్‌లో పార్టీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోహిత్ పవార్ మాట్లాడుతూ సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. 'ఇది చాలా ఖండించదగిన సంఘటన. చిన్న విషయాలకు కూడా వెంటనే ట్వీట్ చేసే బీజేపీ నాయకులు... ప్రజల ఆగ్రహం వెల్లువెత్తిన ఏడు నుంచి ఎనిమిది గంటల తర్వాత మాత్రమే దీని గురించి ట్వీట్ చేశారు. దీనిని ఏమని అర్థం చేసుకోవాలి?' అని ఆయన అన్నారు.

25 నాటికి డిజిటల్ పంటల సర్వే పూర్తి: రాజశేఖర్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో డిజిటల్ పంటల సర్వేలో భాగంగా ఈ–పంట నమోదు నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఈనెల 25వ తేదీ లోపు పూర్తి చేయాలని వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి మండల స్థాయి వ్యవసాయ, ఉద్యాన, ప్లానింగ్, గణాంక శాఖ అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా అమలవుతున్న ఈ–పంట విధానాన్ని కేంద్రప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని, ఈ ఖరీఫ్ సీజన్ నుంచి దేశవ్యాప్తంగా డిజిటల్ పంటల సర్వే విధానాన్ని అమలు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని రాజశేఖర్ అన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఈ–పంట నమోదుపై దృష్టి పెట్టాయన్నారు. సర్వేలో కృష్ణా జిల్లా 58 శాతంతో ముందుంటే, వైఎస్ఆర్ జిల్లా 19 శాతంతో వెనకబడిందని రాజశేఖర్ వెల్లడించారు. వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు మాట్లాడుతూ, నోటిఫైడ్ పంటలకు ఈ–కేవైసీ మినహాయించినట్లు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రోజువారీ లక్ష్యాలు నిర్ధారించి, ప్రతి మండల ఆర్ఎస్‌కే పరిధిలో మిగిలిన భూ కమతాలను గుర్తించి వేగంగా నమోదు చేయాలని ఆదేశించారు. అవసరమైతే గ్రామ సచివాలయ సిబ్బందిని అదనంగా వినియోగించుకోవాలని సూచించారు.

అంగరంగ వైభవం సిరిమాను సంబరం

పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన జాతర

విశాలాంధ్ర–విజయనగరం: శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది జనం జేజేలు పలుకుతుండగా, బెస్తవారి వల, అంజలి రథం, పాలధార, తెల్ల ఏనుగు ముందు నడవగా అమ్మవారు సిరిమాను రూపంలో మూడుసార్లు కోట వద్దకు వెళ్లి రాజ కుటుంబాన్ని, ఆశేష భక్త జనావళిని ఆశీర్వదించారు. ఈ వేడుకను భక్తులు కనులారా తిలకించి పులకించారు. సంప్రదాయబద్ధంగా పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించి భక్త జనాన్ని ఆశీర్వదించారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 4.15 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమయ్యింది. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పర్యవేక్షించారు. సుమారు 5.45 గంటలకు ఉత్సవం పూర్తయింది. అధికార యంత్రాంగం తీసుకున్న పటిష్ట చర్యల కారణంగా ఈ ఉత్సవం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి పూసపాటి వంశీయులు, మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు, రాజ కుటుంబీకులు కోట బురుజు పై నుంచి తిలకించారు. వీరితో పాటు జిల్లా ఇంఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు, అనేక మంది ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు కోట పై నుంచి ఉత్సవాన్ని తిలకించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.